

6న జడ్పీ స్థాయీసంఘ సమావేశాలు

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల ఆరో తేదీన జరగనున్నాయని సీఈవో పి.నారాయణ మూర్తి తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో ఆరో తేదీ ఉదయం పది గంటలకు రెండో స్థాయీ సంఘ సమావేశం, 11 గంటలకు నాలుగు, మధ్యాహ్నం 12 గంటలకు ఏడు, ఒకటి స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయన్నారు. చైర్‌పర్సన్ ఛాంబర్‌లో ఉదయం 10.30 గంటలకు మూడు, 11.30 గంటలకు ఐదు, మధ్యాహ్నం 12.30 గంటలకు ఆరో స్థాయీ సంఘ సమావేశం జరుగుతాయన్నారు.

వైసీపీలో కలవరం

డ్రగ్స్‌తో పట్టుబడిన పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు కొండారెడ్డి

- అతడికి పలువురు నేతలతో లింకులు
- డ్రగ్స్ కూడా సరఫరా చేసేవాడని ప్రచారం
- కాల్‌డేటా ఆధారంగా కొంతమందిని విచారించే అవకాశం
- నాలుగు నెలల కిందట పద్మనాభం వద్ద ఒక నేత ఇచ్చిన పార్టీలో డ్రగ్స్ వినియోగం
- ఆ పార్టీకి చాలామంది హాజరు
- దీనిపై పూర్తిస్థాయిలో కూపీలాగుతున్న పోలీసులు



కొండారెడ్డి (ఫైల్



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పులగం కొండారెడ్డి డ్రగ్స్ కేసులో ఈగల్, టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడడం వైసీపీలో కలకలం రేపుతోంది. కొండారెడ్డి చాలాకాలంగా డ్రగ్స్ వినియోగించడంతోపాటు ఇతరులకు విక్రయిస్తున్నట్టు పోలీసులు నిర్ధారించారు. దీంతో అతనితో సన్నిహితంగా ఉంటూ డ్రగ్స్‌ను వాడిన నేతలు కంగారుపడుతున్నారు. ఏ క్షణంలో పోలీసులు తమను పిలుస్తారోనని ఆందోళన చెందుతున్నారు. నగరానికి చెందిన పార్టీ యువజన విభాగం నేత ఒకరు సోమవారం ఇక్కడకు రావాల్సి ఉన్నప్పటికీ ఈ కేసు విషయం తెలియగానే హైదరాబాద్‌లో ఉండిపోయారంటున్నారు.

బెంగళూరు నుంచి డ్రగ్స్‌ను తీసుకొస్తుండగా ముగ్గురు యువకులను ఈగల్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అందులో వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు కొండారెడ్డి ఉండడం, అతనే డ్రగ్స్‌ను బెంగళూరు నుంచి తెప్పించి, ఇతరులకు విక్రయిస్తున్నట్టు విచారణలో తేలడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అయితే కొండారెడ్డికి చాలాకాలంగా డ్రగ్స్‌ను సేవించే అలవాటు ఉండడంతోపాటు పార్టీలోని కొందరు నేతలకు సరఫరా చేస్తున్నట్టు చెబుతున్నారు. కొండారెడ్డి ఫోన్ కాల్‌డేటా ఆధారంగా అతడి ద్వారా డ్రగ్స్ పొందిన వారందరినీ అరెస్టు చేస్తామని పోలీసులు ప్రకటించడంతో వారంతా జాగ్రత్తపడే పనిలో నిమగ్నమయ్యారని చెబుతున్నారు. పార్టీ యువజన విభాగంలో ఉన్నత స్థానంలో ఉన్న నగరానికి చెందిన నేత ఒకరికి కొండారెడ్డితో సత్సంబంధాలు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. సదరు నేత నాలుగు నెలల కిందట పద్మనాభం వద్ద ఒక రిసార్టులో పార్టీ ఏర్పాటుచేశారని, ఆ సమయంలో అర్ధరాత్రి దాటిన తర్వాత సింథటిక్ డ్రగ్స్‌ను వాడారని ఆ పార్టీ నేతలు కొందరు చెబుతున్నారు. తాము కూడా ఆ పార్టీకి హాజరయ్యామని, కానీ భోజనం చేసిన తర్వాత వచ్చేశామని, అర్ధరాత్రి తర్వాత డ్రగ్స్ వినియోగించినట్టు తమకు తర్వాత తెలిసిందని నగరానికి చెందిన కొందరు నేతలు చెబుతున్నారు. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో పూర్తిస్థాయిలో కూపీ లాగుతున్నట్టు తెలిసింది. ఇదిలావుండగా రెండు రోజుల కిందట హైదరాబాద్ వెళ్లిన ఒక నేత సోమవారం నగరానికి రావాల్సి ఉన్నప్పటికీ కొండారెడ్డి వ్యవహారం బయటపడడంతో...అక్కడే ఉండిపోయినట్టు చెబుతున్నారు. కొండారెడ్డితో సత్సంబంధాలు కలిగివున్నవారు పార్టీలో చాలామంది ఉన్నారని, కీలకంగా వ్యవహరిస్తున్న ఒక నేతకు అతను భారీగా ఖర్చుపెడుతుంటాడని అంటున్నారు. వచ్చే నెలలో కొండారెడ్డి పుట్టిన రోజు ఉందని, ఆరోజు పార్టీ నేతలకు భారీ పార్టీ ఇచ్చేందుకు ప్లాన్ చేశాడని, దానికోసమే డ్రగ్స్‌ను తెప్పించినట్టున్నాడని కొందరు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. కొండారెడ్డితోపాటు అరెస్టు అయిన ఇద్దరినీ త్వరలో కస్టడీకి తీసుకుంటామని, పూర్తిస్థాయిలో విచారిస్తే వారితో సంబంధాలు కలిగివున్నవారంతా బయటకు వస్తారని డీసీపీ మేరీప్రశాంతి ప్రకటించారు.

కమిషనరేట్‌లో కలియతిరిగిన డీజీపీ

- ప్రతి విభాగం పరిశీలన

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):



డీజీపీ హరీష్ కుమార్‌గుప్తా సోమవారం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కలియతిరిగారు. ఉదయం కొంతసేపు సీపీ శంఖబ్రతబాగ్చీతో మాట్లాడారు. అనంతరం ప్రతి అంతస్థుకు వెళ్లి అక్కడున్న విభాగాలను పరిశీలించారు. కంట్రోల్ రూమ్‌కు వెళ్లి అక్కడి నుంచి నగరంలోని వివిధ కూడళ్లు, ప్రాంతాలు, రోడ్లకు సంబంధించిన సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. కమిషనరేట్ ఆవరణలో నిలిచిపోయిన భవన నిర్మాణాలను పరిశీలించి వాటి గురించి సీపీని ఆరా తీశారు. అక్కడి నుంచి పాత సీపీ కార్యాలయం, స్పెషల్ బ్రాంచి, ఏఆర్‌కాంప్లెక్స్‌ను పరిశీలించారు. కార్యాలయం ఆవరణ పరిశుభ్రంగా ఉంచడంపై సీపీతోపాటు ఏఆర్ విభాగం అధికారులను అభినందించారు.

నేవల్ ప్రాజెక్టు డీజీగా కె.శ్రీనివాస్

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):



విశాఖపట్నం నేవల్ ప్రాజెక్టు డైరెక్టర్ జనరల్‌గా వైస్ అడ్మిరల్ కె.శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. నేవల్ డాక్‌యార్డ్ సూపరింటెండెంట్‌గా తన పదవీకాలం పూర్తి కావడంతో ప్రభుత్వం డైరెక్టర్ జనరల్‌గా నియమించింది. కోరుకొండ సైనిక్ స్కూల్, నేవల్ డిఫెన్స్ అకాడమీలో విద్య అభ్యసించిన ఆయన 1990లో నేవీలో ప్రవేశించారు. తన 35 ఏళ్ల సర్వీసులో సముద్రంలోనే ఎక్కువకాలం పనిచేశారు. యుద్ధ విమాన వాహక నౌక ఐఎన్ఎస్

... మిగతా 6వ పేజీలో

లక్ష్యానికి దూరంగా ఉక్కు ఉత్పత్తి

తప్పిన లెక్కలు, అయినా యాజమాన్యం గొప్పలు

- 92 శాతం ఉత్పత్తి సాధిస్తామంటూ సీఎంకు హామీ
- అక్టోబరు నెలలో వచ్చింది 74 శాతమే...
- ఆ విషయం మరుగుపరచేందుకు తిప్పలు
- గత ఏడాది అక్టోబరు నెలతో పోలిక
- అప్పటి పరిస్థితులు వేరు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు యాజమాన్యం ఉత్పత్తి పెరిగిందని చెప్పుకోవడానికి నానాతంటాలు పడుతోంది. రెండు నెలల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసిన యాజమాన్య ప్రతినిధులు 92 శాతం ఉత్పత్తి సాధిస్తామని హామీ ఇచ్చారు. అదే విషయం ఇక్కడకు వచ్చి ఉద్యోగులు, కార్మికులకు చెప్పి, అంతా కలిసి పని చేద్దామని, లక్ష్యం సాధిద్దామని ప్రతిజ్ఞ చేయించారు. ఇప్పుడు అక్టోబరు నెలలో చూస్తే ఒక్కరోజు కూడా 92 శాతం ఉత్పత్తి సాధించలేదు. మొత్తంగా చూసుకుంటే మూడు బ్లాస్ట్ ఫర్నేస్(బీఎఫ్)ల ద్వారా 74 శాతమే ఉత్పత్తి తీశారు. అయితే, ఇది గత ఏడాది అక్టోబరు నెలతో పోల్చితే అధికమని, ప్లాంటును ముందుకు తీసుకువెళుతున్నామని గొప్పలు చెబుతున్నారు.

గత ఏడాది (2024) అక్టోబరు పరిస్థితి పూర్తిగా వేరు. అప్పుడు ముడి పదార్థాలకు నిధులు లేవు. కర్మాగారం ఆర్థిక సమస్యలతో పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయింది. దాంతో ఉత్పత్తి బాగా పడిపోయింది. ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నీ సమకూర్చాయి. దాంతో పూర్తి ఉత్పత్తి సాధించాల్సి ఉంది. కానీ అది చూపించలేక గత ఏడాది ఉత్పత్తితో ఈ అక్టోబరు ఉత్పత్తిని పోల్చి వృద్ధి రేటు నమోదు చేశామని చెప్పుకుంటోంది.

ప్లాంటులో మూడు బ్లాస్ట్ ఫర్నేసుల ద్వారా రోజుకు 21 వేల నుంచి 22 వేల టన్నుల హాట్ మెటల్ తీయవచ్చు. అయితే సమస్యలు ఉన్నాయి కాబట్టి అంత చేయలేమని రోజుకు 19 వేలు టన్నులు చొప్పున 92 శాతం సగటు ఉత్పత్తి తీస్తామని యాజమాన్యం ప్రకటించింది. దీనికి అనుగుణంగా ముడి పదార్థాల సరఫరా పెంచి, అవసరమైన సంఖ్యలో కార్మికులను అందుబాటులో ఉంచాలి. కానీ వాటిని యాజమాన్యం విస్మరించింది. రెండో విడత వీఆర్ఎస్ ఇచ్చి 470 అధికారులను ఇంటికి పంపింది. మరో 550 మంది కాంట్రాక్టు వర్కర్లను తొలగించింది. రామెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటు (ఆర్ఎంహెచ్‌పీ), కోక్ ఓవెన్, సింటర్ ప్లాంటులో ఇబ్బందులు ఉన్నాయి. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోలేదు. దాంతో ఉత్పత్తి ఆశించిన విధంగా రాలేదు. అక్టోబరు నెలలో ఒక్కరోజు కూడా 19 వేల టన్నులు ఉత్పత్తి చేయలేకపోయారు. సగటున రోజుకు ఉత్పత్తి 16,336 టన్నులు మాత్రమే వచ్చింది.


- బ్లాస్ట్ ఫర్నేస్-1లో రోజుకు సగటున 5,135 టన్నుల చొప్పున అక్టోబరులో 1,59,171 టన్నుల హాట్ మెటల్ వచ్చింది.
- బ్లాస్ట్ ఫర్నేస్-2లో రోజుకు 4,214 టన్నుల చొప్పున 1,30,629 టన్నుల ఉత్పత్తి వచ్చింది.
- బ్లాస్ట్ ఫర్నేస్-3లో రోజుకు 6,988 టన్నుల చొప్పున 2,16,627 టన్నుల ఉత్పత్తి తీశారు. దీని ద్వారా రోజుకు ఎనిమిది వేల టన్నుల ఉత్పత్తి తీసే అవకాశం ఉంది. కానీ సాధించలేకపోయారు.

మొత్తంగా చూసుకుంటే మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌ల ద్వారా 5,06,427 టన్నుల హాట్ మెటల్ వచ్చింది. ఇది 74 శాతం మాత్రమే. అయితే గత ఏడాది అక్టోబరులో 66 శాతమే ఉత్పత్తి చేశామని, దానికంటే ఇప్పుడు 8 శాతం ఎక్కువ సాధించామని అధికారులు పేర్కొంటున్నారు. మొత్తం 92 శాతం చేస్తామని హామీ ఇచ్చి దానికంటే 18 శాతం వెనుకపడ్డామనే విషయం మరుగున పెడుతున్నారు. యాజమాన్య ప్రతినిధుల్లో కొందరికి వచ్చే నెలతో పదవీ కాలం పూర్తవుతుంది. మరో ఆరు నెలలు కొనసాగడానికి ఇలా తప్పుడు లెక్కలు చూపిస్తున్నారని ఉద్యోగ వర్గాలు ఆరోపిస్తున్నాయి.

నిలిచిన కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు!

వినికిడి సమస్యతో జన్మించే చిన్నారులకు ఈ శస్త్రచికిత్స వరం

- సుమారు పది లక్షల రూపాయలు వ్యయమయ్యే సర్జరీ ఎన్‌టీఆర్ వైద్య సేవలో ఉచితంగా నిర్వహణ
- ఆడిట్ పేరుతో గడిచిన నాలుగు నెలల నుంచి నిలిచిపోయిన ఆపరేషన్లు
- మళ్లీ ఎప్పుడు ప్రారంభిస్తారోనని ఆశగా ఎదురుచూస్తున్న చిన్నారుల తల్లిదండ్రులు
- ఆలస్యమయ్యే కొద్దీ కొందరు అర్హత కోల్పోయే ప్రమాదం



కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్స చిత్రం

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): **పుట్టుకతోనే వినికిడి సమస్యతో బాధపడే చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు నిర్వహించే కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలు గడిచిన నాలుగు నెలలుగా నిలిచిపోయాయి. అత్యంత ఖరీదైన ఈ శస్త్ర చికిత్సలను ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చేయిస్తోంది. అయితే, ఇప్పటివరకూ జరిగిన వాటికి సంబంధించి ఆడిట్‌ను నిర్వహిస్తున్నందున తాత్కాలికంగా శస్త్ర చికిత్సలు నిలిపివేయాలంటూ జిల్లాలోని ఆస్పత్రులకు ఆదేశాలు అందాయి.**

సాధారణంగా 11 నెలలు వయసు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు మాత్రమే ఈ కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సలను చేస్తుంటారు. మూడేళ్లలోపు చేయించుకుంటే ఫలితం మెరుగ్గా ఉంటుంది. అయితే, చిన్నారుల్లో సమస్యను తల్లిదండ్రులు సకాలంలో కనుగొనలేకపోతున్నారు. మూడు, నాలుగేళ్లు దాటిన తరువాత కొందరు, ఐదేళ్లు వచ్చిన తరువాత మరికొందరు గుర్తించగలుగుతున్నారు. చిన్నారులకు వివిధ రకాల పరీక్షలు చేసి, వారు శస్త్రచికిత్సకు అర్హులు అని నిర్ధారించేందుకు కనీసం ఆరు నెలలు సమయం పడుతుంది. ఈలోగా వయసు ఐదేళ్లకు మించకూడదు. అప్పుడు మాత్రమే శస్త్ర చికిత్స నిర్వహిస్తారు. అయితే, ఇప్పుడు నాలుగు నెలల నుంచి శస్త్ర చికిత్సలను నిర్వహించే

... మిగతా 6వ పేజీలో

పదోన్నతుల కోసం పైసా వసూల్

డీసీసీబీలో కలెక్షన్ కింగ్‌లు

- పోస్టును బట్టి రేటు
- రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ...
- మొత్తం రూ.కోటి?



విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): **జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో పదోన్నతులకు భారీగా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బ్యాంకులో కీలక స్థానంలో ఉన్నవారికి సన్నిహితులైనవారు (అనధికార వ్యక్తులు) చేతులమీదుగా ఈ వ్యవహారం సాగినట్టు ఫిర్యాదులు వచ్చాయి.**

బ్యాంకు ప్రధాన కార్యాలయంతో పాటు 33 బ్రాంచీలలో ఖాళీల మేరకు పదోన్నతులు కల్పించేందుకు గత నెల 23, 24 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఒక డీజీఎం, నాలుగు ఏజీఎం, నాలుగు చీఫ్ మేనేజర్, ఆరు మేనేజర్, 12 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు బోర్డును ఏర్పాటుచేశారు. ఇందులో బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, సీఈవో, ఆప్కాబ్ నుంచి జనరల్ మేనేజర్, ఆప్కాబ్ నామినేట్ చేసిన సబ్జెక్టు ఎక్స్‌పర్ట్ ఒకరు ఉన్నారు. డీజీఎం పోస్టుకు ఒకరు, నాలుగు ఏజీఎం పోస్టులకు నలుగురు, నాలుగు చీఫ్ మేనేజర్ పోస్టులకు 18 మంది, ఆరు మేనేజర్ పోస్టులకు 20 మంది, 12 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు 60 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. పదోన్నతుల ప్రక్రియలో 100 మార్కులు ఉంటాయి. ఇందులో 80 మార్కులు సదరు అధికారి/ఉద్యోగి సర్వీస్‌కు సంబంధించి, మరో 10 మార్కులు సదరు అధికారి/ఉద్యోగి పనితీరుపై ఆధారపడి (పైఅధికారి వేస్తారు) ఉంటాయి. మిగిలిన పది మార్కులకు ఇంటర్వ్యూ. ఇంటర్వ్యూలన్నీ పూర్తిచేసి గత నెల 31న పదోన్నతులకు సంబంధించి ఆర్డర్లు ఇచ్చారు. అయితే ఇంటర్వ్యూలు ముగిసిన అనంతరం పదోన్నతుల జాబితాలో పేరు కలిగిన వారి వద్ద నుంచి బ్యాంకులో కీలక వ్యక్తి సన్నిహితుడు ఒకరు వసూళ్లకు తెరతీశారు. పోస్టును బట్టి మూడు లక్షల నుంచి రూ. ఐదు లక్షల వరకూ తీసుకున్నట్టు చెబుతున్నారు. నగరంలో ప్రముఖ మోటారు వాహనాల కంపెనీలో పనిచేసే వ్యక్తి డీసీసీబీలో కీలక వ్యక్తి ఛాంబర్‌కు వస్తున్నాడు. మార్కెట్ వ్యవహారాలలో అనుభవం ఉన్న ఆయన స్వయంగా ఫోన్ చేసి ఫలానా చోటుకు సొమ్ములు తీసుకురావాలని కోరినట్టు చెబుతున్నారు. కీలక వ్యక్తి సూచన మేరకు సుమారు కోటి రూపాయలు వసూలు చేశారనే ఆరోపణలు

... మిగతా 6వ పేజీలో

పెరుగుతున్న చికున్‌గున్యా బాధితులు

రోగులను వేధిస్తున్న జాయింట్ పెయిన్స్

- పదుల సంఖ్యలో ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న వైనం



విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో చికున్‌గున్యాతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. తమ వద్దకు వచ్చే వారిలో చికున్‌గున్యా బాధితులు రోజుకు కనీసం ముగ్గురు ఉంటున్నారని వైద్యులు చెబుతున్నారు. వారం రోజుల్లో సుమారు 30 మంది చికున్ గున్యా జ్వరాలతో వచ్చినట్టు కేజీహెచ్ ఓపీ గేటు ఎదురుగా క్లినిక్ నిర్వహించే ఒక ప్రముఖ వైద్యుడు వెల్లడించారు. కొందరు తీవ్రమైన కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారన్నారు.

ఎలా సోకుతుంది..

చికున్‌గున్యా ఎడిస్ ఈజిప్ట్ అనే దోమ వల్ల, ఆ జాతికి చెందిన మరో దోమ ద్వారా సోకుతుంది. ఇదే దోమ వల్ల డెంగ్యూ కూడా వస్తుంది. రోగుల్లో ఆకస్మిక, తీవ్రమైన జ్వరం, తీవ్రమైన కీళ్ల నొప్పులు ఉంటాయి. చేతులు, కాళ్లు, మణికట్టు, చీలమండ వద్ద నొప్పి అధికంగా ఉంటుంది. కొందరిలో తలనొప్పి, వికారం, వాంతులు, శరీరంపై దద్దుర్లు, నీరసం, అలసట ఉంటాయని వైద్యులు తెలిపారు. లక్షణాలను బట్టి చికిత్సను అందిస్తుంటారు. జ్వరం నాలుగు నుంచి వారం రోజులు ఉంటుంది. నొప్పులు మాత్రం కొందరికి రెండు వారాల నుంచి ఆరు నెలు వరకూ ఉంటాయని

... మిగతా 6వ పేజీలో



భీమిలి ఎర్రమట్టి దిబ్బల వద్ద హద్దులను పరిశీలిస్తున్న అధికారులు

ఎర్రమట్టి దిబ్బల్లో జియో హెరిటేజ్ స్థలం గుర్తింపు

భీమునిపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నియమించిన కమిటీ సోమవారం ఎర్రమట్టి దిబ్బలు ప్రాంతాన్ని సందర్శించింది. అక్కడ జియో హెరిటేజ్ స్థలాన్ని గుర్తించింది. ఆ స్థలాన్ని ప్రత్యేకంగా పరిగణించాలని స్థానిక రెవెన్యూ అధికారులకు సూచించింది. జియో హెరిటేజ్ స్థలంలో తవ్వకాలు జరుపుతున్నారని పలువురు హైకోర్టులో ప్రజా ప్రయోజనం వ్యాజ్యం వేశారు. కోర్టు ఆదేశాల మేరకు జియో హెరిటేజ్ స్థలం గుర్తింపునకు వారం కిందట మైనింగ్ శాఖ ఒక కమిటీని ఏర్పాటుచేసింది. ఈ కమిటీలో వీఎంఆర్‌డీఏ నుంచి స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, ఆర్‌డీఓ (సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్సు), గనుల శాఖ నుంచి డిప్యూటీ డైరెక్టర్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నుంచి డైరెక్టర్ పి.దుర్గాప్రసాద్, సీనియర్ జియాలజిస్టు డాక్టర్ శ్రీకాంత్ దొరడ్ల సభ్యులుగా ఉన్నారు. కమిటీ సోమవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించి, జియో హెరిటేజ్ స్థలాన్ని గుర్తించి హద్దులు నిర్ణయించింది. ఆ స్థలం చుట్టూ కాంక్రీట్ పిల్లర్లు నిర్మించిన తరువాత మరోమారు వెళ్లి అన్నీ సరిగ్గా ఉన్నాయో లేదో తనిఖీ చేయనున్నారు.

కొత్త డీఎస్సీకి విద్యా శాఖ కసరత్తు

- ఉమ్మడి జిల్లాల వారీగా సమాచారం పంపాల్సిందిగా పాఠశాల విద్యా శాఖ ఆదేశం
- వచ్చే ఏడాది మే నెలాఖరు వరకూ ఏర్పడనున్న ఖాళీల వివరాలు సేకరణలో అధికారులు
- పదవీ విరమణలు, పదోన్నతులతో భారీగానే ఖాళీలు?
- సుమారు 500 నుంచి 600 వరకు ఉండవచ్చునని ఉపాధ్యాయ సంఘాల అంచనా

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది డీఎస్సీ నిర్వహిస్తామని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాల వారీగా ఖాళీల వివరాలు సిద్ధం చేయాలని పాఠశాల విద్యా శాఖ ఆదేశించింది. వచ్చే ఏడాది మే నెలాఖరు వరకూ ఏర్పడబోయే ఖాళీలను పరిగణనలోకి తీసుకుని కేటగిరీ వారీగా నివేదిక సిద్ధం చేయాలన్న ఆదేశాల మేరకు జిల్లా విద్యా శాఖ వివరాల సేకరణలో నిమగ్నమైంది.

ఈ ఏడాది నిర్వహించిన డీఎస్సీలో అన్ని కేటగిరీలు కలిపి ఉమ్మడి జిల్లాలో 1,134 మందిని ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. వీరికి గత నెల తొలివారంలో నియామక పత్రాలు అందజేశారు. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ శాఖ

... మిగతా 6వ పేజీలో

కమనీయం..అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం సోమవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

భీమిలిలో రాధాకృష్ణ మహోత్సవం రేపు

భీమునిపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీచ్ రోడ్డులో గోకుల పార్కు వద్ద ఉన్న రాధాకృష్ణ ఆలయంలో బుధవారం రాధాకృష్ణ మహోత్సవం నిర్వహించనున్నారు. యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఉదయం 10 గంటలకు భక్తులు సముద్ర స్నానాలు చేసి పూజలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. 12 గంటలకు అన్నసమారాధన జరుగుతుందన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు ఐదు ఫిర్యాదులు

భీమునిపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో సోమవరం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి (పీజీఆర్‌ఎస్) ఐదు ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి 3, ప్రజారోగ్యానికి విభాగానికి రెండు అర్జీలు వచ్చినట్టు చెప్పారని చెప్పారు. వాటిని పరిష్కారానికి సంబంధిత అధికారులకు పంపించామన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి



ఈఈ శాంతిరాజుకు వినతిపత్రం అందిస్తున్న శివాజీ

కొమ్మాది, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కళానగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ జోన్-2 కార్యాలయంలో ఈఈ శాంతిరాజుకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో సాయిబాబా గుడి వెనుక సీసీ రోడ్లు, వీధి దీపాలు, అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని కోరారు.

రేడియాలజీపై ముగిసిన సదస్సు



పుష్పితకు బంగారు పతకంతో పాటు అవార్డు అందిస్తున్న నిర్వాహకులు

ఎండాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ వేదికగా ఇండియన్ రేడియాలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ ఏపీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సు సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పీజీ విద్యార్థులకు నిర్వహించిన పరిశోధన పత్రాల ప్రదర్శనకు రాష్ట్రవ్యాప్తంగా 180 పత్రాలు రాగా వాటిలో ఆంధ్ర వైద్య కళాశాల పీజీ విద్యార్థిని డాక్టర్ గారపాటి పుష్పిత ప్రథమ స్థానంలో నిలిచి వైజాగ్ సిటీ సబ్ చాప్టర్ అవార్డుతో పాటు బంగారు పతకం అందుకున్నారు. అలాగే ఏఎంసీ విద్యార్థులు జయగురు సంబతారాజన్ ద్వితీయ బహుమతి, రాజారెడ్డి తృతీయ బహుమతి పొందారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఆర్ఐఏ అధ్యక్షుడు, నిర్వాహక కార్యదర్శి డాక్టర్ వి. సురేశ్, ఏపీ ఐఆర్ఐఏ కార్యదర్శి ఉమామహేశ్వరరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ పర్యవేక్షణాధికారి డాక్టర్ వాణి, రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ బుజ్జిబాబు, డాక్టర్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పద్మనాభం రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని శిర్లపాలెం ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ సింహాచలంనాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతవరం, పెంట. కొత్త కొవ్వాడ, పాత కొవ్వాడ, గంధవరం, తిమ్మపురం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించాలన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : వైసీపీ

భీమునిపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ తరువాత పట్టణంలో చాలా సమస్యలు నెలకొన్నాయని, వాటిని పరిష్కరించాలని వైసీపీ మూడో వార్డు అధ్యక్షుడు అల్లిపల్లి నరసింగరావు, ప్రధాన కార్యదర్శి వాసుపల్లి కొండబాబు, యువజన ప్రధాన కార్యదర్శి ఆర్. ప్రభాకర్‌నాయుడు కోరారు. సోమవారం వారు జోనల్ కార్యాలయంలో జడ్సీ అయ్యప్పనాయుడుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా తోటవీధి, బోయివీధి, రెల్లివీధి ప్రాంతాలకు కొళాయిలు రావడం లేదన్నారు. చాలా ప్రాంతాల్లో వీధి లైట్లు వెలగడం లేదని, కాలువలు పూడికలతో నిండిపోయాయని చెప్పారు. తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు.



మెట్ల మార్గంలో ఉన్న ఎస్‌టీపీ ప్లాంట్



పూతోటలో ఏర్పాటు చేసిన ఈటీపీ ప్లాంట్

నిరుపయోగంగా నీటి శుద్ధి యంత్రాలు

- సింహాచలం దేవస్థానంలో దుస్థితి
- 12 ఏళ్ల క్రితం రూ. 50 లక్షలతో ఏర్పాటు
- నిర్వహణ పట్ల అధికారుల అలసత్వం
- తుప్పు పట్టి పాడవుతున్న సామగ్రి



తుప్పు పట్టి పాడవుతున్న సామగ్రి

సింహాచలం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం అధికారుల నిర్లక్ష్యం వల్ల లక్షలాది రూపాయల నిధులు దుబారా అవుతున్నాయి. ఇందుకు నిరుపయోగంగా ఉన్న నీటి శుద్ధి యంత్రాలే నిదర్శనం. దేవస్థానం పరిధిలో వాడిన నీటిని శుద్ధి చేసి, సద్వినియోగం చేయాలన్న లక్ష్యంతో 12 ఏళ్ల క్రితం అప్పటి ఈఓ, ప్రస్తుతం దేవాదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ రామచంద్రమోహన్ సారథ్యంలో రెండు నీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేశారు. కొండదిగువ పూతోటలో రూ. 10 లక్షలతో ఎఫిలెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, మెట్ల మార్గంలో రూ. 40 లక్షలతో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించారు. ఎస్‌డబ్ల్యూటీపీ ద్వారా అన్నప్రసాద విభాగంలోని గంజి, సమీపంలోని చాకిరేవు వద్ద స్థానికులు దుస్తులు ఉతకడం ద్వారా వచ్చిన సబ్బు నీరు, ఇతర వాడుక నీటిని శుద్ధి చేయడం, పూతోటలోని ఈటీపీ ద్వారా సింహగిరి నీటి ప్రవాహాల వద్ద భక్తులు స్నానాలు చేసిన నీటిని శుద్ధి చేయడం కోసం వీటిని ఏర్పాటు చేశారు. శుద్ధి చేసిన నీటిని పూతోటలోని మొక్కలను పంపించి, స్వామివారి ఆరాధనకు అవసరమైన పుష్పాలు సమకూర్చుకోవాలన్నది నాటి ఈఓ లక్ష్యం. కొద్దిరోజుల్లోనే ఆయనకు బదిలీ కావడంతో ఆ తరువాత వచ్చిన ఈఓలు, ఇంజినీరింగ్ అధికారులు ప్లాంట్ల నిర్వహణ పట్టించుకోకుండా వదిలేయడంతో మూతపడ్డాయి. మెట్ల మార్గంలోని ప్లాంట్‌కు చెందిన యంత్ర సామగ్రి పూర్తిగా పాడైంది. పూతోటలోని ప్లాంట్ యంత్రాలు తుప్పు పట్టి పనిచేస్తాయో లేదో తెలియని స్థితికి చేరుకున్నాయి. ప్లాంట్లను వినియోగంలోకి తీసుకురావడం ద్వారా స్వామివారి ఆరాధనకు కావాల్సిన పుష్పాలను సాగు చేసుకోవచ్చు. దీనివల్ల దేవస్థానానికి ప్రతి నెలా లక్షలాది రూపాయలు ఆదా అవుతాయి. ఆ దిశగా దేవస్థానం పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



ఎండాడ : ప్రత్యేక అలంకరణలో పశుపతినాథేశ్వరుడు



మధురవాడ : మానం ఆంజనేయ నగర్‌లో శివ లింగం



పద్మనాభంలోని నారాయణేశ్వరాలయంలో ధ్వజ స్తంభం వద్ద పూజలు

భక్తులతో శివాలయాలు రద్దీ

- వేకువజాము నుంచే కిటకిట
- మార్మోగిన శివనామ స్మరణ

భీమునిపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం రెండో సోమవారం పురస్కరించుకుని నియోజకవర్గంలోని అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున ఐదు గంటల నుంచే ఆలయాల వద్ద బారులు తీరారు. భీమిలి పట్టణంలోని భ్రమరాంబికా సహిత చోడేశ్వరస్వామి, కాత్యాయిని సహిత భీమేశ్వరాలయం,బాలాత్రిపుర సుందరి సహిత చంద్రశేఖర ఆలయాల్లో భక్తులు పూజలు, అభిషేకాలు జరిపారు. చోడేశ్వరాలయంలో ఉదయం నుంచే భక్తులు క్యూ కట్టారు. అలాగే రుక్మిణీ సత్యభామ సహిత వేణుగోపాలస్వామి, జగన్నాథస్వామి,లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో కూడా పూజలు జరిగాయి.

సింహాచలంలో...

సింహాచలం : సింహగిరి హరిహరుల నామస్మరణతో మార్మోగింది. నగరంలోని పలు ప్రాం తాలతో పాటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కొండ దిగువన పుష్కరిణిలో, సింహగిరి మెట్ల మార్గంలోని జల ధారల్లో స్నానాలు ఆచరించారు. తరువాత సింహగిరి క్షేత్ర పాలకుడు బాల త్రిపుర సుందరి సమేత త్రిపురాంతకస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి, అప్పన్న ఆలయాల ఆవరణల్లో ఉసిరి, సాధారణ దీపారాధనలు చేశారు.అనంతరం పరమేశ్వరుడ్ని దర్శించుకుని పంచామృతాలతో, జలాలతో అభిషేకం చేశారు.సాయంత్రం ఆలయ ప్రధాన గోపురాల వద్ద ఆకాశ దీపాలు వెలిగించారు.

మధురవాడ, కొమ్మాదిలో...

కొమ్మాది, మధురవాడ :కొమ్మాది, మధురవాడలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొమ్మాది అష్టలక్ష్మీ దేవాలయంలో వైశాఖేశ్వరస్వామికి అర్చకుడు చక్రధరస్వామి ఆధ్వర్యంలో భక్తులు రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించారు. సిద్దేశ్వరస్వామి ఆలయంలో, మారికవలస కాశీపంచాయతన విశ్వేశ్వరస్వామి ఆలయంలో, వికలాంగుల కాలనీలో కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పీఎంపాలెం, రాజీవ్ గృహకల్ప కాలనీలోని శివాలయాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి.మానం ఆంజనేయ నగర్‌లోని లలిత త్రిపుర సుందరీదేవి సమేత మహాకామేశ్వరస్వామి ఆలయం, మిథిలాపురి వుడాకాలనీలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం, మధురవాడ శివాలయంలో భక్తులు వేకువజాము నుండే స్వామి దర్శనం కోసం బారులు తీరారు. ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.



సింహగిరిపై క్షేత్ర పాలకుని సన్నిధిలో పూజలు

ఎండాడలో...

ఎండాడ : ఎండాడలో కోదండ రామాలయం, షిర్డీసాయి గణపతి పశుపతినాథేశ్వర స్వామి ఆలయంలో భక్తులు అభిషేకాలు, పూజలు చేశారు. అలాగే కైలాసగిరి దిగువన ఉన్న భవానీ సమేత కైలాసగిరీశ్వర స్వామి ఆలయంలో సామూహిక ఏకవార అభిషేకాలు నిర్వహించారు.

పద్మనాభంలో..

పద్మనాభం : మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే దర్శనాలకు పోటెత్తారు. పద్మనాభం నారాయణేశ్వరాలయం, మద్ది కాశీ విశ్వేశ్వరాలయం, పొట్నూరు ఉమానీలకంఠేశ్వరాలయం, రెడ్డిపల్లి ఉమారామలింగేశ్వరాలయం, బీఆర్ తాళ్లవలస వల్లభ నారాయణేశ్వరాలయం. కుద్రపల్లి శివాలయాల్లో శివార్చన నిర్వహించారు. మహిళలు ధ్వజ స్తంభాలు నందీశ్వరుడి వద్ద దీపారాధనలు చేశారు.

వంటశాల ప్రారంభం

ఆనందపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని గంభీరం పంచాయతీ ఐఐఎం రోడ్డులో ఉన్న హరేకృష్ణ మూవ్మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌లో ఏర్పాటు చేసిన అన్న క్షేత్ర వంట శాలను డాక్టర్ నిష్కించిన భక్త దాస సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ఉమ్మడి జిల్లాల్లో ఉన్న అన్నా క్యాంటీన్లలో మొదటి దశలో 60 క్యాంటీన్లకు తమ ట్రస్టు ద్వారా అన్న ప్రసాదం అందిస్తున్నామన్నారు. క్యాంటీన్లకు అనుకున్న సమయానికి వేడిగా ఆహారం అందించాలన్న సంకల్పంతో వంట శాలలను విస్తరిస్తున్నామని, ఇప్పటివరకు ఆరు ఉండగా కొత్తగా మరో వంట శాలను ప్రారంభించామన్నారు.

మహిళా క్రికెట్ జట్టు విజయం పట్ల సంబరాలు



విద్యార్థినికి కేక్ తినిపిస్తున్న మాజీ మంత్రి ముత్తంశెట్టి

భీమునిపట్నం (రూరల్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్ సాధించడం పట్ల స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సంబరాలు నిర్వహించారు. కళాశాల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కేక్ కట్ చేసి, విద్యార్థులకు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా క్రికెటర్లు ప్రపంచ కప్ సాధించడం ద్వారా భారతీయ క్రికెట్‌లో సువర్ణ అధ్యాయనం లిఖించారన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. మురళీకృష్ణ, డైరెక్టర్ కె. చంద్రశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ కోలా శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న చికున్‌గున్యా బాధితులు

... 5వ పేజీ తరువాయి

వైద్యులు చెబుతున్నారు.

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

వారం, పది రోజులుగా రోజుకు రెండు, మూడు కేసులు వస్తున్నాయి. ఎక్కువమంది దిలో జాయింట్ పెయిన్స్ తీవ్రంగా ఉంటున్నాయి. పెయిన్ కిల్లర్స్ వాడకూడదు. వైద్యుల సలహా మేరకు మందులు వినియోగించాలి. లక్షణాలను బట్టి చికిత్స ఉంటుంది. చికున్ గున్యా బారినపడిన వారందరికీ జాయింట్ పెయిన్స్ ఉండవు. కొందరికి తీవ్రమైన తలనొప్పి, వాంతులు, వికారం ఉంటాయి. దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

- డాక్టర్ వై.జ్ఞానసుందరరాజు, జనరల్ ఫిజీషియన్

పదోన్నతుల కోసం పైసా వసూల్

... 5వ పేజీ తరువాయి

వెల్లువెత్తుతున్నాయి. పదోన్నతి పొందిన ప్రతి ఒక్కరూ సొమ్ములు ఇవ్వాల్సిందేనని దబాయించారని కొందరు ఉద్యోగులు అంటున్నారు. సొమ్ముల వ్యవహారంపై కొందరు సిబ్బంది ఆప్కాబ్‌కు ఫిర్యాదులు చేశారని చెబుతున్నారు. కాగా ఈ ఆరోపణలను బ్యాంకు సీఈవో డీవీఎస్ వర్మ వద్ద ప్రస్తావించగా ఆప్కాబ్ నిబంధనలు, మార్గదర్శకాల మేరకూ పదోన్నతులు కల్పించామన్నారు. మెరిట్, రోస్టర్ మేరకు ఇంటర్వ్యూకు వచ్చే అభ్యర్థుల జాబితా తయారుచేశామన్నారు. పదోన్నతులు పారదర్శకంగా చేపట్టామని పేర్కొన్నారు.

వైసీపీ 'కోటి సంతకాల సేకరణ'

పద్మనాభం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ప్రయత్నాన్ని విరమించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని వైసీపీ నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను) అన్నారు. పద్మనాభంలోని పార్టీ కార్యాలయం వద్ద సోమవారం కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు వైద్య సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, దాని నుంచి కూటమి ప్రభుత్వం తప్పుకోవాలని చూస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కె.లక్ష్మణరావు, ఎంపీపీ కె. రాంబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్. గిరిబాబు, నాయకులు సన్యాసినాయుడు, పద్దు తదితరులు పాల్గొన్నారు.

గెడ్డ నీరు రోడ్డుపైకి రాకుండా నిరోధించండి

పద్మనాభం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభం జంక్షన్‌లో గెడ్డ నీరు రోడ్డు మీదకు రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కె. రూపేష్ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. భారీ వర్షాలకు గెడ్డ చెత్తతో మూసుకుపోయి ఆ నీరంతా రోడ్డుపై పారుతోంది.ఈ విషయం తెలిసిన ఎంపీడీఓ సోమవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. నీరు ఎక్కడి నుంచి వస్తుందో గమనించి, రోడ్డు మీదకు రాకుండా నిరోధించాలని పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బందిని ఆదేశించారు.



బాలికను అభినందిస్తున్న ఎంఈఓలు, సీఆర్‌పీలు

'స్కూల్ టు అసెంబ్లీ'కి బోయపాలెం విద్యార్థిని ఎంపిక

ఆనందపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బోర అక్షయ స్టూడెంట్ ఎమ్మెల్యేగా ఎంపికైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన స్కూల్ టు అసెంబ్లీ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో స్టూడెంట్ ఎమ్మెల్యే ఎంపిక కోసం ఇటీవల భీమిలి, ఆనందపురం, పద్మనాభం, చినగదిలి మండలాల విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన 12 మందికి సోమవారం ఫైనల్ పోటీ నిర్వహించారు. అందులో బోయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బోర అక్షయ విజేతగా నిలిచి స్టూడెంట్ ఎమ్మెల్యేగా ఎంపికైంది. నాలుగు మండలాల ఎంఈవోలు జోగేంద్రనాథ్, గంగరాజు, రవీంద్రబాబు, బాబూలాల్, శివరాణి, తదితరులు బాలికను అభినందించారు.

వ్యక్తిపై కేసు నమోదు

పద్మనాభం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వైట్ కలర్ వేస్ట్ ఆయిల్ నిల్వ ఉంచిన వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసినట్టు సీఐ శ్రీధర్ చెప్పారు. రేవిడి పంచాయతీ రౌతులపాలెంలో సారిక పైడినాయుడు వద్ద వైట్ కలర్ వేస్ట్ ఆయిల్ నిల్వ ఉందని వచ్చిన సమాచారం మేరకు భీమిలి సీఎస్ డీటీ శ్రీనివాసరావు, రేవిడి వీఆర్వో రఘు తనిఖీ చేసి గుర్తించారు. ఈమేరకు వారు పైడినాయుడు వద్ద రెండు క్యాన్లతో ఉన్న 70 లీటర్ల ఆయిల్‌ను స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన

సాగర్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ గీతం యూనివర్సిటీ ఉమెన్ లీడర్స్ ఫోరమ్, గీతం రోటరాక్ట్ క్లబ్, గీతం స్టూడెంట్ లైఫ్ సంయుక్తంగా వర్సిటీ ఆవరణలో సోమవారం పింక్‌వాక్ పేరిట కార్యక్రమం నిర్వహించారు. గీతం ప్రో వీసీ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రాజు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ప్రైవేట్ వాహనాలకు ఛార్జింగ్ అవకాశం

సాగర్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ, జీవీఎంసీ స్మార్ట్ సిటీ విభాగం సంయుక్తంగా నిర్వహిస్తున్న సాగర్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్‌లో సోమవారం నుంచి ప్రైవేట్ వాహనాలకు కూడా చార్జింగ్ సదుపాయం కల్పించారు. ప్రైవేట్ వాహనాలకు ఛార్జింగ్ చేయడం ద్వారా వచ్చే ఆదాయం స్మార్ట్ సిటీ విభాగం ఖాతాలోకి వెళ్లనుంది.

బీచ్ రోడ్డులో త్రుటిలో తప్పిన ప్రమాదం



రోడ్డుపై పడిపోయిన వాల్ ట్రీ గార్డు

సాగర్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్ కల్వర్టుపై ఏర్పాటు చేసిన వాల్ ట్రీ గార్డు సోమవారం ఆకస్మాత్తుగా పడిపోయింది. ఆ సమయంలో అటువైపు ఎవరూ రాకపోకలు చేయకపోవడంతో ప్రమాదం తప్పింది. గతంలో కూడా ఇలానే జరిగింది. ట్రీ గార్డులు బరువైన ఇనుప చానలతో తయారు చేసినవి కావడంతో గాలులకు పడిపోతుంటాయి. అధికారులు తక్షణమే స్పందించి ట్రీ గార్డులు పడిపోకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నిలిచిన కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు!

... 5వ పేజీ తరువాయి

ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో చాలామంది చిన్నారులకు వయసు దాటిపోతోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి వెంటనే ప్రక్రియను ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

నెలకు ఆరు నుంచి ఎనిమిది..

కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సలను పెదవాల్తేరులోని ప్రభుత్వ ఈఎన్‌టీ, గాయత్రీ ఆస్పత్రిలో నిర్వహిస్తున్నారు.ఈ రెండు ఆస్పత్రుల్లో నెలకు ఆరు నుంచి ఎనిమిది వరకు నిర్వహిస్తుంటారు. ఈ శస్త్ర చికిత్స నిర్వహించడానికి ముందు చిన్నారికి ఆస్పత్రి అధికారులు పరీక్షలు నిర్వహించి, అనంతరం అమర్చాల్సిన పరికరం కోసం ఎన్‌టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు ఇండెంట్ పెడతారు. ప్రభుత్వమే ఆయా పరికరాలను కొనుగోలు చేసి ఆస్పత్రులకు సరఫరా చేస్తుంది. ఒకేసారి నెలకు ముగ్గురు, నలుగురు చిన్నారులకు అవసరమైన పరికరాల కోసం అధికారులు ఇండెంట్ పెడుతూ ఉంటారు. ఇలా పరికరాలు వచ్చిన తరువాత చిన్నారులకు శస్త్ర చికిత్సలను నిర్వహిస్తారు. శస్త్రచికిత్స అనంతరం సదరు చిన్నారులకు స్పీచ్ థెరపీ వంటివి చేయడం ద్వారా సాధారణ స్థితికి తీసుకువస్తారు. ఈ శస్త్రచికిత్సను బయట చేయించుకోవాలంటే సుమారు రూ.8 లక్షలు నుంచి రూ.12 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ప్రభుత్వమే ఈ మొత్తాన్ని భరించి ఎన్‌టీఆర్ వైద్య సేవలో చేస్తుండడంతో ఎంతోమంది చిన్నారులకు మేలు చేకూరుతోంది. ఈ శస్త్ర చికిత్సల కోసం ఇటు ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన చిన్నారులు నగరంలోని ఆస్పత్రులకు వస్తుంటారు. ఇప్పుడు వారంతా మళ్లీ ఈ ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుందా?... అని ఎదురుచూస్తున్నారు.

కొత్త డీఎస్సీకి విద్యా శాఖ కసరత్తు

... 5వ పేజీ తరువాయి

పరిధిలో 400 ఖాళీలు, ప్రభుత్వ, జడ్పీ పరిధిలోని పాఠశాలల్లో సుమారు 150 ఖాళీలను తాజా డీఎస్సీ ద్వారా భర్తీచేశారు. ఇంకా ఏజెన్సీతోపాటు మైదానంలో ఎస్జీటీ, స్కూలు అసిస్టెంట్ కేటగిరీల్లో ఖాళీలు ఉన్నాయి. అదేవిధంగా ప్రతినెలా పలువురు టీచర్లు పదవీ విరమణ చేస్తున్నారు. 1989 నుంచి 1998 మధ్య డీఎస్సీ ద్వారా నియమితులైన పలువురు టీచర్లు ఈ ఏడాది నవంబరు, డిసెంబరు, వచ్చే ఏడాది మే నెలాఖరులోగా పదవీ విరమణ చేయనున్నారు. ఇంకా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పదవీ విరమణ చేయడంతో ఆయా పోస్టులకు స్కూలు అసిస్టెంట్లతో భర్తీచేయనున్నారు. దీంతో స్కూలు అసిస్టెంట్ కేటగిరీలో ఖాళీలు ఏర్పడనున్నాయి. ఇదిలావుండగా ఉమ్మడి జిల్లాలో కొందరు టీచర్లు స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని వచ్చే ఏడాది మే నెలాఖరు నాటికి ఏర్పడబోయే ఖాళీల వివరాలను మండల విద్యాశాఖాధికారుల నుంచి జిల్లా విద్యా శాఖ సేకరిస్తోంది. వచ్చే ఏడాది మే నెలాఖరుకల్లా సుమారు 500 నుంచి 600 వరకు ఖాళీలు ఉండే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలు అంచనా వేస్తున్నాయి. మండలాల నుంచి పూర్తి వివరాలు వచ్చిన తరువాత గానీ ఖాళీలపై స్పష్టత రాదని అంటున్నారు. పాఠశాల విద్యా శాఖ ఆదేశాల మేరకు వచ్చే ఏడాది మే నెలాఖరు వరకూ ఏర్పడబోయే ఖాళీల వివరాలు నివేదిక సిద్ధం చేస్తున్నామని విశాఖ డీఈవో నిమ్మక ప్రేమ్‌కుమార్ తెలిపారు.

నేవల్ ప్రాజెక్టు డీజీగా కె.శ్రీనివాస్

... 5వ పేజీ తరువాయి

విరాట్‌లో వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. ఐఎన్ఎస్ విక్రమాదిత్యకు రష్యాలో మరమ్మతులు చేయాల్సి వచ్చినప్పుడు సూపరింటెండెంట్‌గా వెళ్లారు. యుద్ధ విమాన వాహక నౌకల ప్రాజెక్ట్‌కు ప్రిన్సిపల్ డైరెక్టర్‌గా పనిచేశారు.


డివైడర్‌కు రంగులు వేస్తున్న దృశ్యం

బీఆర్‌టీఎస్ రోడ్లకు సొబగులు

ఆరిలోవ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల రెండో వారంలో ఏయూ గ్రౌండ్‌లో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సుకు ప్రముఖులు రానున్నందున నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇందులో భాగంగా బీఆర్‌టీఎస్ రోడ్లకు సుమారు 15 రోజులుగా కొత్త సొబగులు అద్దుతున్నారు. రూ. 90 లక్షలతో హనుమంతవాక జంక్షన్ నుంచి అడవివరం కూడలి వరకు మూడు రోడ్లకు ఆనుకొని ఉన్న డివైడర్లకు జీబ్రా రంగులు వేస్తున్నారు.

వ్యాసరచన, క్విజ్ పోటీలకు విద్యార్థి ఎంపిక

ఆరిలోవ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తూర్పు నియోజకవర్గ పరిధిలోని పాఠశాలలకు సోమవారం వివిధ పోటీలు నిర్వహించారు. ఇందులో శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకులంలో చదువుతున్న వై. యోగి వ్యాసరచన, క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడని గురుకుల ప్రిన్సిపాల్ తెలిపారు విశాఖ, అనకాపల్లి జిల్లాల అంబేడ్కర్ గురుకులాల సమన్వయకర్త జి.గ్రేస్ విద్యార్థి యోగిని అభినందించారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ఆరిలోవ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 12వ వార్డు నెహ్రూనగర్‌లో మొంథా తుఫాన్ ధాటికి నష్టపోయిన మత్స్యకార కుటుంబాలకు సోమవారం 50 కిలోల బియ్యం, కందిపప్పు, పామాయిల్, గోధుమ పిండి, ఉల్లిపాయలు, బంగాళదుంపలు పంపిణీ చేశారు. 12 వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, పార్లమెంటరీ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు, గాడి సత్యం తదితరులు పాల్గొన్నారు. 13వ వార్డులో కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

పాత వెంకోజీపాలెంలో...

వెంకోజీపాలెం : తుఫాన్ కారణంగా నిరాశ్రయులైన చంద్రరావు కుటుంబానికి కూటమి ప్రభుత్వం 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను సోమవారం పాత వెంకోజీపాలెంలోని 212వ డిపో వద్ద అందజేసింది. 15వ వార్డు టీడీపీ నాయకులు కర్రి రవి, సంపంగి సురేష్, కర్రి శ్రీను, రాజు, డిపో డీలరు కాళ్ల అప్పలరాజు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో ఫ్రెషర్స్ డే

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ చిరంజీవిరావు, గౌరవ అతిథిగా ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పాల్గొంటారన్నారు.

సినిమా గైడ్

- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శరత్, శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య, ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : నంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజీ** కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి** సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 30, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 52,గుత్తి/రవి వంకాయలు 58, బెండకాయలు 54, పచ్చిమిర్చి 30, బజ్జి పకోడి మిర్చి 40,కాకరకాయలు 36, బీరకాయలు 48, ఆనపకాయ 2,కాలీఫ్లవర్ 36, క్యాబేజి 26, క్యారెట్ 58, దొండకాయలు 34, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె) 7, మునక్కాడలు (కిలో) 94,అల్లం (పాతది) 66, బరబాటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 54, దోసకాయలు 38, పోటల్స్ 58, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీట్‌రూట్ 44, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 22, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడ దుంపలు 30, కంద 52, కంద దుంప 46, ముల్లంగి 34,దేముడు చిక్కుడు 66, గోరు చిక్కుడు 46, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230



కొత్త వెంకోజీపాలెం గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో విశేషంగా అలంకరించిన శివలింగం, అభిషేకంలో పాల్గొన్న భక్తులు


ఇసుకతోట ఉమామహేశ్వరాలయంలో శివుని రూపాలంకరణ

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

- వేకువజాము నుంచే బారులు తీరిన భక్తులు
- ఇబ్బందులు లేకుండా నిర్వాహకుల ఏర్పాట్లు

ఆరిలోవ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా ఆరిలోవలోని శివాలయాలు శివనామ స్మరణతో మారుమోగాయి. బాలత్రిపుర సుందరీ సమేత మల్లేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేకువ జాము నుంచే బారులు తీరారు. ఆలయంలో భక్తులు సామూహికంగా అభిషేకాలు చేశారు. ధర్మకర్త కృష్ణంరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు. తొలుత శివునికి పవిత్ర జలాలు, పంచామృతాలు, నారికేళ జలం, విభూతి, తేనె, పంచదార, పాలు, గంధంతో అభిషేకాలు చేశారు.పెదగదిలిలోని కాశీ అన్నపూర్ణ, విశ్వేశ్వరాలయం, ఆరిలోవలోని పంచాయతన ద్వాదశ జ్యోతిర్లింగేశ్వర ఆయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు స్వహస్తాలతో అభిషేకాలు చేసి సంతృప్తి చెందారు.

ఘనంగా పూజలు

మద్దిలపాలెం : మద్దిలపాలెంలోని ఉమామహేశ్వర పంచాయతన ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచే భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం చేసి భక్తిశ్రద్ధలతో వేడుకున్నారు. ఉమామహేశ్వరునికి పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్తీక మాస ఉత్సవ కమిటీ చైర్మన్ అచ్చి రమేష్‌రెడ్డి, అధ్యక్షుడు కాకి గోపాల్‌రెడ్డి, అర్చకుడు గాయత్రి శర్మ పర్యవేక్షించారు. పీతలవానిపాలెంలోని రాజరాజేశ్వరి సమేత శ్రీరామలింగేశ్వర స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా చక్కెర అభిషేం

పెదవాల్తేరు : పెదవాల్తేరులోని కాశీవిశ్వేశ్వర స్వామికి సోమవారం చక్కెర అభిషేకం చేశారు. విశేష పూజలు, పంచామృతాభిషేకాలు జరిగాయి. కార్తీక మాసం రెండో సోమవారం కావడంతో పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. తెల్లవారుజాము నుంచే క్యూలైన్లు భక్తులతో కిక్కిరిశాయి. చైర్మన్ జ్యోతి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన అర్చకులు కాశీ ప్రసాద్, చిన అప్పారావు, అభిషేక్ పాల్గొన్నారు.


ఆరిలోవ బాలత్రిపుర సుందరీ సహిత మల్లేశ్వర స్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వెంకోజీపాలెంలో...

వెంకోజీపాలెం : 'హరహర మహాదేవ శంభో శంకర' అన్న భక్తుల శివనామస్మరణతో ఆలయాలు ప్రతిధ్వనించాయి. శివ దర్శనానికి భక్తులు బారులు తీరారు. శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక మాసంలో అభిషేకాలు, పూజలు చేయిస్తే మంచి జరుగుతుందనే ఆలోచనతో భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు క్యూకట్టారు. కొత్తవెంకోజీపాలెంలోని జ్ఞానానంద ఆశ్రమం గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో విశేష సంఖ్యలో హాజరైన భక్తులకు ఆలయ ప్రధానార్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు గోత్రనామాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు ధ్వజస్తంభం వద్ద ఆకాశ జ్యోతి వెలిగించారు. దేవస్థానం ఈవో బండారు ప్రసాద్, సిబ్బంది పర్యవేక్షించారు. స్థానిక గ్రామసేవా సంఘం ప్రతినిధులు ఆడారి సత్యనారాయణ, పీల ప్రేమ్‌కిరణ్ జగదీష్, మళ్ల రవికుమార్ సహకరించారు. ఎంఎంటీసీ కాలనీ త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వెంకటాచార్యులు, గోపాలకృష్ణ శర్మ ధ్వజస్తంభం వద్ద ఆకాశజ్యోతులు వెలిగించారు. ఇసుకతోటలోని ఉమామహేశ్వరాలయంలో సుందరంగా శివలింగాన్ని అలంకరించారు. హెచ్‌బీకాలనీ, కేఆర్‌ఎం కాలనీల్లోని శివాలయాల్లోనూ అభిషేకాలు, అర్చనలు, పూజలు జరిగాయి.


కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో దీపారాధన


ఉమామహేశ్వరునికి పూజలు

ప్రతిఫలం ఆశించని సేవలు ప్రశంసనీయం


అవార్డులు ప్రదానం చేస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యేలు పల్లా, విష్ణుకుమార్‌రాజు, గౌతు శిరీష, లయన్స్ క్లబ్ ప్రతినిధులు


కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మకు వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాసరావు

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

సాగర్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతిఫలం ఆశించకుండా ఉత్తమ సేవలందిస్తున్న లయన్స్ క్లబ్ ఇంట ర్నేషనల్ కార్యక్రమాలు ప్రశంసనీయమని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. లైన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సోమవారం రాడిసన్ బ్లూలో నిర్వహించిన ఫోర్బ్స్ ఇండియా పశ్చిమ, దక్షిణ జోన్‌ల అవార్డుల ప్రదానోత్సవానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లైన్స్ క్లబ్ దాతృత్వ, సేవా కార్యక్రమాలు చేస్తోందని, కాళ్లులేని 550 మందికి కృత్రిమకాళ్లు అందించిందన్నారు. క్లబ్‌లో తెలుగు వారు అత్యున్నతస్థాయి ప్రాతినిథ్యం వహించడం అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన సహకారం అందిస్తామన్నారు. దేశ కీర్తి ప్రతిష్ఠలు పెంచేది బీజేపీ మాత్రమేనన్నారు. ప్రధాని మోదీ విశాఖకు ప్రాధాన్యత ఇస్తారని, రూ.2 లక్షల కోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారన్నారు. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ కేటాయించారన్నారు. అనంతరం విద్య, నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత, పర్యావరణం, హెల్త్‌కేర్ రంగానికి చెందిన విజేతలు, రన్నరప్‌లకు మంత్రి, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, పల్లా శ్రీనివాసరావు, గౌతు శిరీష, లయన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రెజరర్ వేగేశ్న విజయ్‌రాజు, లైన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ పి. సుభాష్‌బాబు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లైన్స్ ఇంటర్నేషనల్ కృష్ణంరాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌సిటీ డిపోను కొనసాగించాలి

ద్వారకాబస్‌స్టేషన్ : ప్రయాణికుల అవసరాల దృష్ట్యా ఆర్టీసీ స్టీల్‌సిటీ డిపోను యధాతథంగా కొనసాగించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్‌ఎంయూఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను కోరారు. ఈ మేరకు నగరానికి వచ్చిన మంత్రికి సోమవారం వినతిపత్రం అందజేశారు. 1990లో డిపోను ఆర్టీసీ యాజమాన్యం ఏర్పాటు చేసిందని, అప్పట్లో రూ.1.5 కోట్లతో పరిపాలనా భవనం, గ్యారేజీ, బస్‌కాంప్లెక్సు నిర్మించారన్నారు. లీజు ఒప్పందం ముగియడంతో ఆస్థలాన్ని ఖాళీ చేయాలని స్టీల్ ప్లాంట్ యాజమాన్యం నోటీసులు ఇచ్చిందని, గడువు పొడిగించాలంటే రూ.138 కోట్లు చెల్లించాలని పేర్కొందని వివరించారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని గతంలోని ఒప్పందం మేరకే డిపోను కొనసాగించేలా సహకరించాలని కోరారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు వినతిపత్రం ప్రతులను అందజేశారు. పిళ్లా శంకరరావు, సాయిరాం పాల్గొన్నారు.

రక్తమోడిన రహదారి


ప్రమాదానికి గురైన వాహనాలు


అంబులెన్స్‌లో క్షతగాత్రుడికి ధైర్యం చెబుతున్న హోం మంత్రి అనిత

- కొక్కిరాపల్లి వద్ద ఘోర ప్రమాదం
- ఆగి ఉన్న ఆటోను ఢీకొన్న టాటా మ్యాజిక్
- ఇద్దరి మృతి, ఎనిమిది మందికి తీవ్ర గాయాలు
- సహాయక చర్యల్లో హోం మంత్రి అనిత

ఎలమంచిలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కిరాపల్లి వద్ద జాతీయ రహదారిపై సోమవారం ఆగి ఉన్న ఆటోను టాటా మ్యాజిక్ ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందారు. ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు.

గాజువాక శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన బండి సాలేమ్‌రాజు ఏడుగురితో కలిసి టాటా మ్యాజిక్ వాహనంలో కాకినాడ జిల్లా పిఠాపురం బయలుదేరారు. ఉదయం 10.20 గంటలకు కొక్కిరాపల్లి ప్రేమసమాజం వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న లారీని ఎడమ వైపు నుంచి ఓవర్‌టేక్ చేసే క్రమంలో డ్రైవర్ కె.నానిబాబు ఆగి వున్న ఆటోను ఢీకొన్నాడు. సీఐ ధనుంజయరావు, ఎస్‌ఐ ఉపేంద్ర చేరుకుని, వాహనాల్లో ఇరుక్కుపోయిన వారికి బయటకు తీశారు. ఆటోలో ప్రయాణిస్తున్న కశింకోట మండలం తీడ గ్రామానికి చెందిన ఆరుగురు, టాటా మ్యాజిక్‌లోని బండి జాస్మిన్, బండి కరుణ, బండి ఆనంద విజయ, బండి అబ్బాయిలకు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ కె.నానిబాబు, బండి నరసింగరావు అలియాస్ సాలేమ్‌రాజు, నడిగట్ల విజయ, ఎస్.రాజ్‌కుమార్ స్వల్పంగా గాయపడ్డారు. అదే సమయంలో హోం మంత్రి వంగలపూడి అనిత నక్కపల్లి వెళుతూ కాన్వాయ్‌ను ఆపించి, క్షతగాత్రులను ఆస్పత్రుల కు తరలించేలా చర్యలు చేపట్టారు. అనకాపల్లి పంపిన క్షతగాత్రుల్లో గొంది పెంటయ్య (56), బాదంపూడి లక్ష్మి(65) చికిత్స పొందుతూ మృతిచెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఉపేంద్ర తెలిపారు.

నకిలీ బ్యాంకు అకౌంట్లు అందించిన ఇద్దరి అరెస్టు

ఎండాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ కేంద్రంగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠాలకు నకిలీ బ్యాంకు అకౌంట్లు ఓపెన్ చేసి అందించిన ఇద్దరు యువకులను సైబర్ క్రైమ్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బెట్టింగ్ ముఠాల ఆర్థిక లావాదేవీల నిర్వహణకు బ్యాంక్ ఖాతాలు అవసరం. మధురవాడకు చెందిన బోనెల మాధవ (23), హరియాల శ్రీకాంత్ (28) బ్యాంక్ అకౌంట్స్‌ను సైబర్ నేరగాళ్లకు అందిస్తున్నారన్న పక్కా సమాచారంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా 35 అకౌంట్లు తెరిచి భారీ మొత్తంలో కమీషన్ తీసుకున్నట్టు అంగీకరించారు. కరూర్ వైశ్యా బ్యాంక్, ఏపీజీవీబీ, కర్ణాటక బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో ఖాతాలు తెరిచి వాటి వివరాలను చత్తీస్‌ఘడ్‌లోని భిలాయ్‌కి చెందిన ప్రేమ్ అనే వ్యక్తికి తర్వాత ఢిల్లీకి చేరవేశారు. పోలీసులు ఇద్దరు యువకులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

10 నుంచి అఖిల భారత పోస్టల్ టేబుల్ టెన్నిస్


టోర్నమెంట్ లోగో ఆవిష్కరిస్తున్న పోస్ట్‌మాస్టర్ జనరల్ జయశంకర్

ఎంవీపీ కాలనీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల పదో తేదీ నుంచి 14 వరకూ 40వ అఖిల భారత పోస్టల్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ విశాఖలో నిర్వహించనున్నట్టు విశాఖ ప్రాంతీయ పోస్టమాస్టర్ జనరల్ వీఎస్ జయశంకర్ తెలిపారు. ఎంవీపీ కాలనీలోని తపాలా శాఖ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎంవీపీ కాలనీలోని ఎస్ 3 స్పోర్ట్స్ ఎరీనాలో పోటీలు నిర్వహిస్తామన్నారు. అనంతరం టోర్నమెంట్ లోగో, టీజర్‌ను ఆవిష్కరించారు. దేశంలోని తపాలా శాఖ 14 సర్కిళ్ల నుంచి 121 మంది క్రీడాకారులు పాల్గొంటారని, మెన్స్ సింగిల్స్, డబుల్స్, విమెన్స్ సిగిల్స్, డబుల్స్ పోటీలు జరుగుతాయన్నారు. డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఎన్‌వీఎస్‌ఎన్‌రాజు, డిప్యూటీ సూపరింటెండెంట్ కోమల్‌కుమార్, రీజనల్ ఆఫీసు అసిస్టెంట్ డైరెక్టర్ కేవీడీ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌లో ఆరు నెలల్లో రూ.5,634 కోట్ల రుణాలు

- ఏపీ రాజధానిపై స్పష్టతతో పెరగనున్న వ్యాపారం
- ఎల్‌ఐసీ హౌసింగ్ ఎండీ, సీఈఓ త్రిభువన్ అధికారి



విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లోని తొలి ఆరు నెలల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో కూడిన దక్షిణ రీజియన్‌లో రూ.5,634 కోట్ల హౌసింగ్ రుణాలు ఇచ్చినట్టు ఎల్‌ఐసీ హౌసింగ్ ఎండీ, సీఈఓ త్రిభువన్ అధికారి తెలిపారు. రీజనల్ సమావేశానికి విశాఖపట్నం వచ్చిన ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. సంస్థ దేశవ్యాప్తంగా ఇచ్చే రుణాల్లో దక్షిణ రీజియన్ వాటా 25 శాతంగా ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సరం (2024-25) ఈ రీజియన్‌లో రూ.13,050 కోట్ల రుణాలు పంపిణీ చేశామన్నారు. ఈ ఏడాది రూ.15 వేల కోట్లు ఇచ్చే అవకాశం ఉందన్నారు. ఏపీలో గత ప్రభుత్వం రాష్ట్ర రాజధాని విషయంలో పెట్టుబడిదారులను డైలమాలో పెట్టిందని, ఇప్పుడు ప్రభుత్వం మారిన తరువాత స్పష్టత వచ్చినందున గృహ నిర్మాణం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. సంస్థకు రుణగ్రహీతల నుంచి రూ.63 వేల కోట్లు రావలసి ఉందన్నారు. సంస్థకు దేశవ్యాప్తంగా 303 మార్కెటింగ్ ఆఫీసులు ఉండగా, ఏపీలో మూడు క్లస్టర్లు, 20 ఏరియా కార్యాలయాలతో పటిష్ఠమైన నెట్‌వర్క్‌తో పనిచేస్తున్నామన్నారు.

ప్రాథమిక అంశాలపై అవగాహన అవసరం


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్, కళాశాలల ప్రిన్సిపాళ్లు

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కెరియర్ ప్లానింగ్ డెవలప్‌మెంట్ సెంటర్ (సీడీపీసీ)ను సోమవారం ప్రారంభించారు. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ సీడీపీసీ వివరాలతో కూడిన బ్రోచర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఉద్యోగాల కల్పనకు ప్రాథమిక అంశాల్లో జ్ఞానం కీలకమన్నారు. సంస్థల ఆలోచనావిధానంలో మార్పులు వస్తున్నాయని, అందుకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను, సామర్థ్యాలను వృద్ధి చేసుకోవాలన్నారు. కోర్సులో చేరినప్పటి నుంచి భవిష్యత్తుపై నిర్దిష్ట ప్రణాళికతో సాగాలన్నారు. ప్రాథమిక సాంకేతిక అంశాలపై అవగాహన, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, సరైన దృక్పథంతో సాగడం, నేర్చుకునే మనస్తత్వం, ఆసక్తి కలిగిన రంగంలో పనిచేసే తత్వం, ప్రాజెక్టుల్లో అనుభవ పూర్వక జ్ఞానాన్ని పొందడం కెరియర్ ప్లానింగ్‌లో కీలకమన్నారు. ఇందుకోసం విభాగం, క్లస్టర్, వర్సిటీ స్థాయిలో మార్గదర్శకాలను సిద్ధం చేశామన్నారు. ఉద్యోగ నియమానికి వెళ్లే సమయంలో మంచి సీజీపీఏ కలిగి ఉండడం, కమ్యూనికేషన్‌స్కిల్స్ ప్రభావాన్ని చూపుతాయ న్నారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వీఆర్‌రెడ్డి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు అందిం చేందుకు చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ పి. కింగ్, ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ జి.శశిభూషణరావు, ఎ.నరసింహారావు, జి.గిరిజా శంకర్, ఎంవీఆర్ రాజు, కె.సీతామాణిక్యం, ఆర్.పద్మశ్రీ, డి. నాగరాజుకుమారి పాల్గొన్నారు.

లా కాలేజీలో ఓరియంటేషన్ ప్రొగ్రామ్

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లా కాలేజీలో 2025-26 విద్యాలో చేరిన విద్యార్థులకు సోమవారం ఇండక్షన్, ఒరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎస్‌ఎన్‌ఎల్‌యూ వ్యవస్థాపక వైస్ చాన్సలర్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లా కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వై సత్యనారాయణ హాజరయ్యారు. ప్రతి విద్యార్థి సామాజిక న్యాయవాదులుగా ఎదగాలన్నారు. లా కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. సీతామాణిక్యం, విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ ఎస్‌పాల్ డగ్లస్ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏయూ ఫెన్సింగ్ జట్టు ఎంపిక

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏయూ ఫెన్సింగ్ పురుషులు, మహిళల విభాగాల జట్ల ఎంపిక ప్రక్రియ పూర్తయింది. ఈనెల 5 నుంచి పదో తేదీవరకు గురునానక్‌లో జరిగే ఆలిండియా ఇంటర్ వర్సిటీ పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయని డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎన్.విజయ్ మోహన్ తెలిపారు.

16న శెట్టిబలిజల వన సమారాధన

వెంకోజీపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16న రాష్ట్రమంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో అమలాపురంలో నిర్వహించనున్న ఉభయ రాష్ట్రాల శెట్టిబలిజల కార్తీకమాస వనసమారాధనను విజయవంతం చేయాలని సంఘం ప్రతినిధులు చొల్లంగి వెంకటరమణ , కుడిపూడి సామ్రాట్, 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్యలు పిలుపునిచ్చారు. సోమవారం ఎల్లమాంబ నగర్‌లోని కార్పొరేటర్ ఇంటి వద్ద జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. విశాఖ నుంచి దాదాపు 100 కార్లు, 5 బస్సులలో వెళ్లనున్నట్టు తెలిపారు. వనభోజనాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇసుకకొండ ఆలయంలో కార్తీక పౌర్ణమికి ఏర్పాట్లు



సత్యనారాయణస్వామి ఆలయం

మహారాణిపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) ఇసుక కొండ సత్యనారాయణ స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి టి.రాజగోపాలరెడ్డి తెలిపారు. విశాఖలో పౌర్ణమి ఆలయంగా పేరొందిన కేజీహెచ్ సమీపంలోని ఇసుకకొండ రమా సత్యనారాయణ స్వామి ఆలయానికి ఏటా కార్తీక పౌర్ణమి రోజు భక్తులు పెద్దసంఖ్యలో తరలి రానున్నారు. ఈ క్రమంలో ఆలయంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని మంగళవారం అర్ధరాత్రి దాటాక ఒంటిగంటకే తెరిచి స్వామివారి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు ముగించి బుధవారం వేకువన 3 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు భక్తులకు స్వామి దర్శనం కల్పించనున్నట్లు వివరించారు. ఉదయం 4 గంటలకు ధ్వజస్తంభం పూజ నిర్వహిస్తామన్నారు. ఉదయం 5, 7, 8.30, 10.30 గంటల సమయంలో ప్రత్యేక వ్రతాలు చేయిస్తామని పేర్కొన్నారు.

9న మాధవధారలో ట్రెక్కింగ్

మాధవధార, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాధవధార కొండమెట్ల దారిలో ఈ నెల 9న ట్రెక్కింగ్ నిర్వహించనున్నట్లు యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నగర చైర్మన్ ఎ.పుండరీకాక్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిదేళ్ల వయస్సు నిండిన ఆరోగ్యవంతులు ఎవరైనా ట్రెక్కింగ్‌లో పాల్గొనవచ్చని సూచించారు. ఉదయం 6.30 గంటలకు ట్రెక్కింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్; 99494 82818 నంబరులో సంప్రదించాలని కోరారు.

ద్విచక్ర వాహనం దగ్ధం



జ్ఞానాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురంలోని సెబాస్టియన్ కాలనీలో ఇంటిముందు నిలిపి ఉంచిన స్కూటీ (ద్విచక్రవాహనం)ను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి తగులబెట్టారు. వాహన యజమాని ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేసుకొని ఘటనా స్థలాన్ని, చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.3 లక్షల పరిహారం

మహారాణిపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): హిట్ అండ్ రన్ కేసులో మృతిచెందిన వ్యక్తి భార్యకు, గాయపడిన మరో ఇద్దరికి రూ.3 లక్షలు పరిహారం అందజేశారు. విశాఖ నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రం ద్వారా బాధితులకు సోమవారం ఈ మొత్తం అందజేశారు. వడ్డాది మాడుగుల ప్రాంతానికి చెందిన కోటేశ్వరరావు ఇటీవల హిట్ అండ్ రన్ ఘటనలో మృతిచెందాడు. ఆయన భార్య కొండ లక్ష్మికి రూ.2 లక్షలు చెల్లించగా, గాయపడిన చిలకలపూడి సురేష్, ఇమంది లక్ష్మణరావులకు రూ.50 వేల వంతున అందజేశారు.

మత్స్యకారులకు రేషన్

కంచరపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో మత్స్యకారులకు ప్రభుత్వం విడుదల చేసిన ఉచిత రేషన్, నిత్యావసర సరుకుల పంపిణీ కూటమి నాయకుల పర్యవేక్షణలో చురుగ్గా జరుగుతోంది. జీవీఎంసీ 55వ వార్డులోని గంగన్న నగర్ 121వ డిపో వద్ద క్లస్టర్ ఇన్‌ఛార్జి ఈతలపాక సుజాత అర్హులకు రేషన్ అందజేశారు. మత్స్యకారులు ఇబ్బంది పడకూడదనే ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబు వారికి బియ్యం, పంచదార, కందిపప్పు, వంటనూనె, ఉల్లి, టమాట, బంగాళదుంపలు అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్లు గంట్యాడ వీరుబాబు, లీలావతి, సుధ, చిన్నారెడ్డి, ఈశ్వరరావు పాల్గొన్నారు.



పార్వతీశ్వరాలయంలో మహాశివలింగం



శివపూజలో పాల్గొన్న భక్తులు



నక్కవానిపాలెంలో..



రెడ్డికంచరపాలెంలో..

శివాలయాల్లో కార్తీక శోభ

కంచరపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండో సోమవారం శైవాలయాలు శివ నామస్మరణతో మారుమోగాయి. గొల్లకంచరపాలెం, ఆర్పీపేట, తిక్కవానిపాలెం, గంగన్న నగర్, రెడ్డికంచరపాలెం తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. కార్తీక మాసం ప్రాధాన్యతను అర్చకులు వివరించారు. అనంతరం విశిష్ట అలంకరణ, హారతి కన్నుల పండువగా చేపట్టారు.

ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో...

సీతమ్మధార, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార నక్కవానిపాలెంలో గల ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో మహా శివలింగానికి పంచామృతం, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఈఓ బండారు ప్రసాద్ పర్యవేక్షణలో అర్చకులు రామారావు శర్మ, మహేష్ శర్మలు భక్తుల గోత్రనామాలతో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు శివనామస్మరణ చేసుకున్నారు.

పార్వతీశ్వరాలయంలో..

సీతంపేట గణేష్‌నగర్‌లో గల పార్వతీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శివాజీ శర్మ, భాస్కర్ శర్మల బృందం వేదమంత్రాలతో అభిషేకాలు, పుష్పాలతో పూజ చేశారు. మహా శివలింగాన్ని అలంకరించారు. భక్తులు దీపాలు వెలిగించారు.

ఏఎంసీలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



వేదికపై ఆశీనులైన ప్రముఖులు

మహారాణిపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర వైద్య కళాశాల (ఏఎంసీ)లో ఆహ్వాన్-2025 పేరుతో సోమవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేజీహెచ్‌లోని కాబ్ ఆడిటోరియంలో నూతనంగా వచ్చిన విద్యార్థులను స్వాగతించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్, కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఫ్రెషర్స్ డే ద్వారా విద్యార్థులలో స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని, కొత్త విద్యార్థులు క్రమశిక్షణ, విలువలు, సృజనాత్మక ఆవిష్కరణలతో ముందుకు సాగాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, డాక్టర్ వాసవిలతా, డాక్టర్ శ్రీహరి, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

పీ4 కార్యాలయంలో ప్రజాదర్బార్



ప్రజల వినతులు పరిశీలిస్తున్న ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, అధికారులు

మాధవధార, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం ఇక నుంచి మాధవధార స్వర్ణాంధ్ర-2047 (పీ4) కార్యాలయంలో ప్రజా సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తానని ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు. సోమవారం తొలిసారి ప్రజల నుంచి లిఖితపూర్వక వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే, అక్కడే ఉన్న జోన్-5 జెడ్సీ బి.రాము, టౌన్‌ప్లానింగ్, తాగునీటి విభాగం అధికారులకు సమస్యల పరిష్కార బాధ్యతను అప్పగించారు. తీసుకున్న చర్యలపై తనకు నివేదించాలని అధికారులను ఆదేశించారు. 50వవార్డు సాయిరాంనగర్ వాసులు తుఫాన్ కారణంగా తమ నివాసిత ప్రాంతంలో దెబ్బతిన్న వీధి దీపాలు, డ్రైనేజీ సమస్యలపై వినతులు సమర్పించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జోన్-5 ఏపీడీలు పుణ్యవతి, పద్మావతి, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల కల్యాణోత్సవం



అల్లిపురంలో గౌరీ పరమేశ్వరుల విగ్రహాలు



ఏఎస్సార్‌నగర్‌లో

అల్లిపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అల్లిపురం వేంకటేశ్వరమెట్ట వద్ద గౌరీ సేవాసంఘం, వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో 78వ గౌరీపరమేశ్వరుల లీలా మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం గౌరీ పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిపారు. వేద మంత్రాల నడుమ గౌరీపరమేశ్వరులను పెళ్లికొడుకు, పెళ్లికూతురుగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పొలమరశెట్టి వెంకటశ్యామ్ కుమార్, పొలమరశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బర్మాక్యాంప్ ఏఎస్సార్ నగర్‌లో..

మురళీనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బర్మాక్యాంప్ ఏఎస్సార్ నగర్‌లో గౌరీ పరమేశ్వర ఉత్సవ మండపంలో సోమవారం మహిళల సామూహిక గీతాలాపన, ప్రత్యేక కాశీ శివలింగ పూజలు నిర్వహించారు. స్థానిక జైలాల్ అల్లూరి గౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలో ఈ నెల 8 వరకు శివపార్వతుల ఉత్సవాలు జరపనున్నట్లు సంఘం అధ్యక్షుడు కె.శివఅప్పారావు తెలిపారు. గౌరీ పరమేశ్వరుల ప్రతిమల వద్ద స్థానికులు పూజలు నిర్వహించారు. సోమవారం సాయంత్రం సంకీర్తనల కోలాటం, అనంతరం ప్రత్యేక కాశీ శివలింగ పూజలు నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.పాపారావు, కోశాధికారి పి.గోపి, ఉపాధ్యక్షులు ఎస్.వెంకరావు తదితరులు హాజరయ్యారు. కార్తీక మాసం కావడంతో సమీప ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు శివపార్వతుల పూజల్లో పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ ఓవరాల్ చాంప్ బుల్లయ్య జట్టు



ట్రోఫీ, ప్రశంసాపత్రాలతో క్రీడాకారులు

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏయూ అంతర్ కళాశాలల పవర్ లిఫ్టింగ్ టోర్నీలో లంకపల్లి బుల్లయ్య కళాశాల పురుషులు, మహిళల విభాగాల్లో ఓవరాల్ చాంపియన్ ట్రోఫీలను కైవసం చేసుకుంది. రన్నరప్‌గా పురుషుల విభాగంలె అనిట్స్ కళాశాల, మహిళల విభాగంలో శ్రీనివాసరావు ఫార్మసీ కళాశాల నిలిచాయి. బుల్లయ్య కళాశాలలో జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమానికి పవర్ లిఫ్టింగ్ ఇంటర్నేషనల్ మెడలిస్టు డి.అనూష గౌడ్, సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ కార్యదర్శి సకల కోటేశ్వరరావు, చైర్మన్ మద్ది ప్రభాకర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు, పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహక కార్యదర్శి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి, కోచ్ డాక్టర్ వీఎల్ఎన్.రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మోడల్ ఎక్స్‌పో



బుల్లయ్య కళాశాల కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్‌కు ప్రాజెక్టు నమూనా పనితీరును వివరిస్తున్న విద్యార్థులు

సీతమ్మధార, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పవర్ సిస్టమ్ జనరేటింగ్ స్టేషన్స్ మోడల్ ఎక్స్‌పో, స్కిల్ స్కోప్ ఆధారిత ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ల్యాబ్‌ను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎక్స్‌పోను ప్రారంభించారు. బీటెక్ విద్యార్థులు థర్మల్, న్యూక్లియర్, గ్యాస్, హైహెడ్ అండ్ లోహెడ్ హైడ్రో పవర్ ప్లాంట్స్, ఎనర్జీ ఆడిట్ వంటి విద్యుదుత్పత్తి స్టేషన్లకు సంబంధించిన నమూనాలు ప్రదర్శించారు. విద్యుదుత్పత్తి, ప్రసార విధానాలు, పునరుత్పాదక శక్తి సమన్వయాలను స్పష్టంగా విద్యార్థులు తమ నమూనాల ద్వారా చూపించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.మధుకుమార్ మాట్లాడుతూ ఎల్ఒటి పునరుత్పాదక శక్తి, స్మార్ట్ గ్రిడ్లు, భవిష్యత్ విద్యుత్ రంగానికి అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.దీపక్ చౌదరి, విభాగాధిపతి డాక్టర్ ఆనంద్ గోందేసి, ఇతర విభాగాధిపతులు డాక్టర్ జి.టి.నాయుడు, డాక్టర్ జె.బాబు, డాక్టర్ డి.మాధవి తదితరులు విద్యార్థులను అభినందించారు.

వైద్య విద్యార్థులకు బంగారు పతకాలు



బంగారు పతకాలు పొందిన విద్యార్థులతో ఏఎంసీ ప్రిన్సిపాల్ సంధ్యాదేవి తదితరులు

మహారాణిపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర వైద్య కళాశాల (ఏఎంసీ) రేడియాలజీ విభాగం విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. గీతం విశ్వవిద్యాలయంలో నిర్వహించిన రేడియాలజీ సదస్సులో పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థులకు నిర్వహించిన పరిశోధనా పత్రాలు, పరిశోధన పత్రికల ప్రదర్శనలో ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థులు అద్భుతంగా రాణించారు. రాష్ట్ర స్థాయిలో 180 పత్రికల పరిశోధన, ప్రదర్శనకు అనుమతి లభించగా జి.పుష్పిత ప్రథమ స్థానం కైవసం చేసుకుని సబ్ చాప్టర్ బంగారు పతకం సాధించారు. డాక్టర్ జయగురు సంబతరాజన్, డాక్టర్ రాజారెడ్డిలు కూడా బంగారు పతకాలు సాధించారు. డాక్టర్ మేఘనా ప్రశంసా పత్రాన్ని పొందారు. ఈ సందర్భంగా ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, సూపరింటెండెంట్ డాక్టర్ ఐ వాణి, రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ బుజ్జిబాబు, ఫ్యాకల్టీ, తోటి విద్యార్థులు పతక సాధకులను అభినందించారు.

వెలుగులివ్వని హైమాస్ట్ లైట్లు..!?



ఆర్‌అండ్‌బి జంక్షన్‌లో వెలుగుతూ ఆరిపోయే హైమాస్ట్ ఇది

మురళీనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గంలో హైమాస్ట్ దీపాల పేరిట ప్రజాధనం వృథా చేస్తున్నారు. వార్డుల్లో నాయకులు పోటీపడి కొత్త హైమాస్ట్ దీపాలు వేసినా, అవి నిరుపయోగంగా మారాయి. తుప్పు పట్టిన 20 అడుగుల స్తంభాలపై దిష్టి బొమ్మల్లా దీపాలు దర్శనమిస్తున్నాయి. ఒక్కో స్తంభంపై ఉండే ఎనిమిది దీపాలు వెలగకున్నా, ఎవరూ పట్టించుకోవడంలేదు. 51వవార్డులోని ఆర్‌అండ్‌బీ జంక్షన్ రోడ్డు, ఎయిర్ పోర్టు పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న లైట్లు ఎక్కడ ఉన్నాయో గుర్తించడమే కష్టంగా మారింది. ఆర్‌అండ్‌బి జంక్షన్ జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జిఎస్‌ఐ) కార్యాలయం ప్రహరీని ఆనుకొని ఉన్న హైమాస్ట్ దీపం ఏడాదిగా తుప్పు పట్టి నామరూపాల్లేకుండా పోయింది. స్తంభంపై ఒక్క లైటూ వెలగడం లేదు. ఎన్ఏడీ, ఊర్వశి జంక్షన్ల వైపు వెళ్లే దారులతో పాటు ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ మీదుగా మాధవధార ఉడాకాలనీకి చేరే మూడు రోడ్ల జంక్షన్‌లో ఉన్న ఈ హైమాస్ట్ దీపాలు వెలగక వాహనదారులు చీకటిలోనే ముందుకు సాగుతున్నారు. మూడు వైపుల నుంచి దూసుకొచ్చే వాహనాలు ప్రమాదాలకు గురికాకుండా వేసిన హైమాస్ట్ దీపస్తంభం ఎంతో ఉపయోగకరం. వీధి దీపాల నిర్వహణ విభాగం, స్థానిక కార్పొరేటరు, సచివాలయ సిబ్బందికి ఈ దీపాలు వెలిగించే ఆసక్తి లేదు. ఆరు నెలల క్రితం ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఎదుటే హైవే సెంటరు డివైడరుపై వేసిన 8 దీపాలు వెలుగుతూ, ఆరుతూ డిస్కో లాంప్‌లా మారింది. ప్రతి రెండు నిమిషాలకు లైటు దానంతట అదే ఆగిపోయి, మళ్లీ వెలుగుతుండడంతో వాహనదారులు తికమక పడుతున్నారు. సర్వీసు రోడ్డు నుంచి ఇక్కడి హైవేసెంటరు కారిడార్‌కు మలుపు ఉండటంతో మలుపు తీసుకునే వాహనదారులకు ఈ వెలుగులు నిరుపయోగంగా మారుతున్నాయి.

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం సోమవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు.

నేవల్ ప్రాజెక్టు డీజీగా కె.శ్రీనివాస్

... 5వ పేజీ తరువాయి

విరాట్‌లో వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. ఐఎన్ఎస్ విక్రమాదిత్యకు రష్యాలో మరమ్మతులు చేయాల్సి వచ్చినప్పుడు సూపరింటెండెంట్‌గా వెళ్లారు. యుద్ధ విమాన వాహక నౌకల ప్రాజెక్టుకు ప్రిన్సిపల్ డైరెక్టర్‌గా పనిచేశారు.

పదోన్నతుల కోసం పైసా వసూల్

... 5వ పేజీ తరువాయి

వెల్లువెత్తుతున్నాయి. పదోన్నతి పొందిన ప్రతి ఒక్కరూ సొమ్ములు ఇవ్వాల్సిందేనని దబాయించారని కొందరు ఉద్యోగులు అంటున్నారు. సొమ్ముల వ్యవహారంపై కొందరు సిబ్బంది ఆప్కాబ్‌కు ఫిర్యాదులు చేశారని చెబుతున్నారు. కాగా ఈ ఆరోపణలను బ్యాంకు సీఈవో డీవీఎస్ వర్మ వద్ద ప్రస్తావించగా ఆప్కాబ్ నిబంధనలు, మార్గదర్శకాల మేరకూ పదోన్నతులు కల్పించామన్నారు. మెరిట్, రోస్టర్ మేరకు ఇంటర్వ్యూకు వచ్చే అభ్యర్థుల జాబితా తయారుచేశామన్నారు. పదోన్నతులు పారదర్శకంగా చేపట్టామని పేర్కొన్నారు.

పెరుగుతున్న చికున్‌గున్యా బాధితులు

... 5వ పేజీ తరువాయి

వైద్యులు చెబుతున్నారు.

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

వారం, పది రోజులుగా రోజుకు రెండు, మూడు కేసులు వస్తున్నాయి. ఎక్కువమం దిలో జాయింట్ పెయిన్స్ తీవ్రంగా ఉంటున్నాయి. పెయిన్ కిల్లర్స్ వాడకూడదు. వైద్యుల సలహా మేరకు మందులు వినియోగించాలి. లక్షణాలను బట్టి చికిత్స ఉంటుంది. చికున్ గున్యా బారినపడిన వారందరికీ జాయింట్ పెయిన్స్ ఉండవు. కొందరికి తీవ్రమైన తలనొప్పి, వాంతులు, వికారం ఉంటాయి. దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

- డాక్టర్ వై.జ్ఞానసుందరరాజు, జనరల్ ఫిజీషియన్

నిలిచిన కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు!

... 5వ పేజీ తరువాయి

ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో చాలామంది చిన్నారులకు వయసు దాటిపోతోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి వెంటనే ప్రక్రియను ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

నెలకు ఆరు నుంచి ఎనిమిది..

కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సలను పెదవాల్తేరులోని ప్రభుత్వ ఈఎన్‌టీ, గాయత్రీ ఆస్పత్రిలో నిర్వహిస్తున్నారు. ఈ రెండు ఆస్పత్రుల్లో నెలకు ఆరు నుంచి ఎనిమిది వరకు నిర్వహిస్తుంటారు. ఈ శస్త్ర చికిత్స నిర్వహించడానికి ముందు చిన్నారికి ఆస్పత్రి అధికారులు పరీక్షలు నిర్వహించి, అనంతరం అమర్చాల్సిన పరికరం కోసం ఎన్‌టీఆర్ వైద్య సేవ ట్రస్టుకు ఇండెంట్ పెడతారు. ప్రభుత్వమే ఆయా పరికరాలను కొనుగోలు చేసి ఆస్పత్రులకు సరఫరా చేస్తుంది. ఒకేసారి నెలకు ముగ్గురు, నలుగురు చిన్నారులకు అవసరమైన పరికరాల కోసం అధికారులు ఇండెంట్ పెడుతూ ఉంటారు. ఇలా పరికరాలు వచ్చిన తరువాత చిన్నారులకు శస్త్రచికిత్సలను నిర్వహిస్తారు. శస్త్రచికిత్స అనంతరం సదరు చిన్నారులకు స్పీచ్ థెరపీ వంటివి చేయడం ద్వారా సాధారణ స్థితికి తీసుకువస్తారు. ఈ శస్త్రచికిత్సను బయట చేయించుకోవాలంటే సుమారు రూ.8 లక్షలు నుంచి రూ.12 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ప్రభుత్వమే ఈ మొత్తాన్ని భరించి ఎన్‌టీఆర్ వైద్య సేవలో చేస్తుండడంతో ఎంతోమంది చిన్నారులకు మేలు చేకూరుతోంది. ఈ శస్త్ర చికిత్సల కోసం ఇటు ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన చిన్నారులు నగరంలోని ఆస్పత్రులకు వస్తుంటారు. ఇప్పుడు వారంతా మళ్లీ ఈ ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుందా?...అని ఎదురుచూస్తున్నారు.

కొత్త డీఎస్సీకి విద్యా శాఖ కసరత్తు

... 5వ పేజీ తరువాయి

పరిధిలో 400 ఖాళీలు, ప్రభుత్వ, జడ్పీ పరిధిలోని పాఠశాలల్లో సుమారు 150 ఖాళీలను తాజా డీఎస్సీ ద్వారా భర్తీచేశారు. ఇంకా ఏజెన్సీతోపాటు మైదానంలో ఎస్జీటీ, స్కూలు అసిస్టెంట్ కేటగిరీల్లో ఖాళీలు ఉన్నాయి. అదేవిధంగా ప్రతినెలా పలువురు టీచర్లు పదవీ విరమణ చేస్తున్నారు. 1989 నుంచి 1998 మధ్య డీఎస్సీ ద్వారా నియమితులైన పలువురు టీచర్లు ఈ ఏడాది నవంబరు, డిసెంబరు, వచ్చే ఏడాది మే నెలాఖరులోగా పదవీ విరమణ చేయనున్నారు. ఇంకా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పదవీ విరమణ చేయడంతో ఆయా పోస్టులకు స్కూలు అసిస్టెంట్లతో భర్తీచేయనున్నారు. దీంతో స్కూలు అసిస్టెంట్ కేటగిరీలో ఖాళీలు ఏర్పడనున్నాయి.

ఇదిలావుండగా ఉమ్మడి జిల్లాలో కొందరు టీచర్లు స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని వచ్చే ఏడాది మే నెలాఖరు నాటికి ఏర్పడబోయే ఖాళీల వివరాలను మండల విద్యాశాఖాధికారుల నుంచి జిల్లా విద్యా శాఖ సేకరిస్తోంది. వచ్చే ఏడాది మే నెలాఖరుకల్లా సుమారు 500 నుంచి 600 వరకు ఖాళీలు ఉండే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలు అంచనా వేస్తున్నాయి. మండలాల నుంచి పూర్తి వివరాలు వచ్చిన తరువాత గానీ ఖాళీలపై స్పష్టత రాదని అంటున్నారు. పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు వచ్చే ఏడాది మే నెలాఖరు వరకూ ఏర్పడబోయే ఖాళీల వివరాలు నివేదిక సిద్ధం చేస్తున్నామని విశాఖ డీఈవో నిమ్మక ప్రేమ్‌కుమార్ తెలిపారు.

అనుమతిలేని సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహం తొలగింపు



జగదాంబ జంక్షన్‌లో కృష్ణ విగ్రహం తొలగిస్తున్న దృశ్యం

మహారాణిపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జగదాంబ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహాన్ని తొలగించారు. గత నెల 26న జగదాంబ జంక్షన్‌లో ప్రఖ్యాత సినీనటుడు ఘట్టమనేని కృష్ణ విగ్రహాన్ని జనసేన నాయకుడు, గ్రేటర్ విశాఖ సిటీవైడ్ సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్ బాబుల అభిమాన సంఘం, సరస్వతీ పార్కు కమిటీ అభిమానుల సంఘం నాయకుడు మన్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అయితే ఈ విగ్రహం ఏర్పాటుకు జీవీఎంసీ, ఇతర ఏ ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు లేవు. కృష్ణ మరణించిన తరువాత ఆయన విగ్రహం ఏర్పాటు చేసేందుకు అభిమానులు ఏడాదికాలంగా కలెక్టరేట్‌లోనూ, జీవీఎంసీ కార్యాలయంలోనూ అవసరమైన పత్రాలు సమర్పించారు. అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ఈ నెల 15న కృష్ణ రెండో వర్ధంతి జరుపుకోనున్న క్రమంలో కృష్ణ, మహేష్‌బాబుల అభిమాన సంఘం ప్రతినిధులు విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇదే స్థలంలో జనసేన పార్టీకి చెందిన జెండా దిమ్మ ఉందని, దానిని తొలగించి విగ్రహం ఏర్పాటు చేయడంతో జనసైనికుల మనోభావాలు దెబ్బతిన్నాయని, తొలగించకపోతే కోర్టును ఆశ్రయిస్తామని జనసేన నాయకుడు బోలిశెట్టి సత్యనారాయణ గతంలో హెచ్చరించారు. విగ్రహాన్ని తొలగించాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ కలెక్టర్, పోలీసు కమిషనర్, జీవీఎంసీ కమిషనర్‌లకు ఫిర్యాదు చేశారు. దీనితో సోమవారం క్రేన్ల సహాయంతో విగ్రహాన్ని తొలగించారు. దీనిపై కృష్ణ అభిమానులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ జనసేన జెండా దిమ్మను తొలగించలేదని, విగ్రహం పక్కనే దిమ్మ ఉందని తెలిపారు. గతంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా కృష్ణ విగ్రహం ఏర్పాటుకు అంగీకరించారని, ఎవరికీ ఎలాంటి ఇబ్బంది ఉండదనే ఉద్దేశంతోనే విగ్రహం ఏర్పాటు చేశామని కృష్ణ అభిమానులు పేర్కొన్నారు.


డివైడర్‌కు రంగులు వేస్తున్న దృశ్యం

బీఆర్‌టీఎస్ రోడ్లకు సొబగులు

ఆరిలోవ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల రెండో వారంలో ఏయూ గ్రౌండ్‌లో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సుకు ప్రముఖులు రానున్నందున నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇందులో భాగంగా బీఆర్‌టీఎస్ రోడ్లకు సుమారు 15 రోజులుగా కొత్త సొబగులు అద్దుతున్నారు. రూ. 90 లక్షలతో హనుమంతవాక జంక్షన్ నుంచి అడవివరం కూడలి వరకు మూడు రోడ్లకు ఆనుకొని ఉన్న డివైడర్లకు జీబ్రా రంగులు వేస్తున్నారు.

వ్యాసరచన, క్విజ్ పోటీలకు విద్యార్థి ఎంపిక

ఆరిలోవ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తూర్పు నియోజకవర్గ పరిధిలోని పాఠశాలలకు సోమవారం వివిధ పోటీలు నిర్వహించారు. ఇందులో శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకులంలో చదువుతున్న వై. యోగి వ్యాసరచన, క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడని గురుకుల ప్రిన్సిపాల్ తెలిపారు విశాఖ, అనకాపల్లి జిల్లాల అంబేడ్కర్ గురుకులాల సమన్వయకర్త జి.గ్రేస్ విద్యార్థి యోగిని అభినందించారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ఆరిలోవ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 12వ వార్డు నెహ్రూనగర్‌లో మొంథా తుఫాన్ ధాటికి నష్టపోయిన మత్స్యకార కుటుంబాలకు సోమవారం 50 కిలోల బియ్యం, కందిపప్పు, పామాయిల్, గోధుమ పిండి, ఉల్లిపాయలు, బంగాళదుంపలు పంపిణీ చేశారు. 12 వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, పార్లమెంటరీ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు, గాడి సత్యం తదితరులు పాల్గొన్నారు. 13వ వార్డులో కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

పాత వెంకోజీపాలెంలో...

వెంకోజీపాలెం : తుఫాన్ కారణంగా నిరాశ్రయులైన చంద్రరావు కుటుంబానికి కూటమి ప్రభుత్వం 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను సోమవారం పాత వెంకోజీపాలెంలోని 212వ డిపో వద్ద అందజేసింది. 15వ వార్డు టీడీపీ నాయకులు కర్రి రవి, సంపంగి సురేష్, కర్రి శ్రీను, రాజు, డిపో డీలరు కాళ్ల అప్పలరాజు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో ఫ్రెషర్స్ డే

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ చిరంజీవిరావు, గౌరవ అతిథిగా ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పాల్గొంటారన్నారు.

సినిమా గైడ్

- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శరత్, శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య, ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజి** కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి**: సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 30, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 52,గుత్తి/రవి వంకాయలు 58, బెండకాయలు 54, పచ్చిమిర్చి 30, బజ్జీ పకోడి మిర్చి 40,కాకరకాయలు 36, బీరకాయలు 48, ఆనపకాయ 2,కాలీఫ్లవర్ 36, క్యాబేజి 26, క్యారెట్ 58, దొండకాయలు 34, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె) 7, మునక్కాడలు (కిలో) 94,అల్లం (పాతది) 66, బరబాటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 54, దోసకాయలు 38, పొటల్స్ 58, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీట్‌రూట్ 44, బీన్స్ (పెన్సిల్) 70, కీర దోస 22, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడ దుంపలు 30, కంద 52, కంద దుంప 46, ముల్లంగి 34,దేముడు చిక్కుడు 66, గోరు చిక్కుడు 46, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230



కొత్త వెంకోజీపాలెం గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో విశేషంగా అలంకరించిన శివలింగం, అభిషేకంలో పాల్గొన్న భక్తులు


ఇసుకతోట ఉమామహేశ్వరాలయంలో శివుని రూపాలంకరణ

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

- వేకువజాము నుంచే బారులు తీరిన భక్తులు
- ఇబ్బందులు లేకుండా నిర్వాహకుల ఏర్పాట్లు

ఆరిలోవ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా ఆరిలోవలోని శివాలయాలు శివనామ స్మరణతో మారుమోగాయి. బాలత్రిపుర సుందరీ సమేత మల్లేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేకువ జాము నుంచే బారులు తీరారు. ఆలయంలో భక్తులు సామూహికంగా అభిషేకాలు చేశారు. ధర్మకర్త కృష్ణంరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు. తొలుత శివునికి పవిత్ర జలాలు, పంచామృతాలు, నారికేళ జలం, విభూతి, తేనె, పంచదార, పాలు, గంధంతో అభిషేకాలు చేశారు.పెదగదిలిలోని కాశీ అన్నపూర్ణ, విశ్వేశ్వరాలయం, ఆరిలోవలోని పంచాయతన ద్వాదశ జ్యోతిర్లింగేశ్వర ఆయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు స్వహస్తాలతో అభిషేకాలు చేసి సంతృప్తి చెందారు.

ఘనంగా పూజలు

మద్దిలపాలెం : మద్దిలపాలెంలోని ఉమామహేశ్వర పంచాయతన ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచే భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం చేసి భక్తిశ్రద్ధలతో వేడుకున్నారు. ఉమామహేశ్వరునికి పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్తీక మాస ఉత్సవ కమిటీ చైర్మన్ అచ్చి రమేష్‌రెడ్డి, అధ్యక్షుడు కాకి గోపాల్‌రెడ్డి, అర్చకుడు గాయత్రి శర్మ పర్యవేక్షించారు. పీతలవానిపాలెంలోని రాజరాజేశ్వరి సమేత శ్రీరామలింగేశ్వర స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా చక్కెర అభిషేం

పెదవాల్తేరు : పెదవాల్తేరులోని కాశీవిశ్వేశ్వర స్వామికి సోమవారం చక్కెర అభిషేకం చేశారు. విశేష పూజలు, పంచామృతాభిషేకాలు జరిగాయి. కార్తీక మాసం రెండో సోమవారం కావడంతో పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. తెల్లవారుజాము నుంచే క్యూలైన్లు భక్తులతో కిక్కిరిశాయి. చైర్మన్ జ్యోతి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన అర్చకులు కాళీ ప్రసాద్, చిన అప్పారావు, అభిషేక్ పాల్గొన్నారు.


ఆరిలోవ బాలత్రిపుర సుందరీ సహిత మల్లేశ్వర స్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వెంకోజీపాలెంలో...

వెంకోజీపాలెం : 'హరహర మహాదేవ శంభో శంకర' అన్న భక్తుల శివనామస్మరణతో ఆలయాలు ప్రతిధ్వనించాయి. శివ దర్శనానికి భక్తులు బారులు తీరారు. శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక మాసంలో అభిషేకాలు, పూజలు చేయిస్తే మంచి జరుగుతుందనే ఆలోచనతో భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు క్యూకట్టారు. కొత్తవెంకోజిపాలెం లోని జ్ఞానానంద ఆశ్రమం గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో విశేష సంఖ్యలో హాజరైన భక్తులకు ఆలయ ప్రధానార్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు గోత్రనామాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు ధ్వజస్తంభం వద్ద ఆకాశ జ్యోతి వెలిగించారు. దేవస్థానం ఈవో బండారు ప్రసాద్, సిబ్బంది పర్యవేక్షించారు. స్థానిక గ్రామసేవా సంఘం ప్రతినిధులు ఆడారి సత్యనారాయణ, పీల ప్రేమ్‌కిరణ్ జగదీష్, మళ్ల రవికుమార్ సహకరించారు. ఎంవీపీ కాలనీ త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వెంకటాచార్యులు, గోపాలకృష్ణ శర్మ ధ్వజస్తంభం వద్ద ఆకాశజ్యోతులు వెలిగించారు. ఇసుకతోటలోని ఉమామహేశ్వరాలయంలో సుందరంగా శివలింగాన్ని అలంకరించారు. హెచ్‌బీకాలనీ, కేఆర్‌ఎం కాలనీల్లోని శివాలయాల్లోనూ అభిషేకాలు, అర్చనలు, పూజలు జరిగాయి.


కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో దీపారాధన


ఉమామహేశ్వరునికి పూజలు

ప్రతిఫలం ఆశించని సేవలు ప్రశంసనీయం


అవార్డులు ప్రదానం చేస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యేలు పల్లా, విష్ణుకుమార్‌రాజు, గౌతు శిరీష, లయన్స్ క్లబ్ ప్రతినిధులు


కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మకు వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాసరావు

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

సాగర్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతిఫలం ఆశించకుండా ఉత్తమ సేవలందిస్తున్న లయన్స్ క్లబ్ ఇంట ర్నేషనల్ కార్యక్రమాలు ప్రశంసనీయమని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. లైన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సోమవారం రాడిసన్ బ్లూలో నిర్వహించిన ఫోర్బ్స్ ఇండియా పశ్చిమ, దక్షిణ జోన్‌ల అవార్డుల ప్రదానోత్సవానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లైన్స్ క్లబ్ దాతృత్వ, సేవా కార్యక్రమాలు చేస్తోందని, కాళ్లలేని 550 మందికి కృత్రిమకాళ్లు అందించిందన్నారు. క్లబ్‌లో తెలుగు వారు అత్యున్నతస్థాయి ప్రాతినిథ్యం వహించడం అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన సహకారం అందిస్తామన్నారు. దేశ కీర్తి ప్రతిష్ఠలు పెంచేది బీజేపీ మాత్రమేనన్నారు. ప్రధాని మోదీ విశాఖకు ప్రాధాన్యత ఇస్తారని, రూ.2 లక్షల కోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారన్నారు. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ కేటాయించారన్నారు. అనంతరం విద్య, నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత, పర్యావరణం, హెల్త్‌కేర్ రంగానికి చెందిన విజేతలు, రన్నరప్‌లకు మంత్రి, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, పల్లా శ్రీనివాసరావు, గౌతు శిరీష, లయన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రెజరర్ వేగేశ్న విజయ్‌రాజు, లైన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ పి. సుభాష్‌బాబు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లైన్స్ ఇంటర్నేషనల్ కృష్ణంరాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌సిటీ డిపోను కొనసాగించాలి

ద్వారకాబస్‌స్టేషన్ : ప్రయాణికుల అవసరాల దృష్ట్యా ఆర్టీసీ స్టీల్‌సిటీ డిపోను యధాతథంగా కొనసాగించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్‌ఎంయూఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను కోరారు. ఈ మేరకు నగరానికి వచ్చిన మంత్రికి సోమవారం వినతిపత్రం అందజేశారు. 1990లో డిపోను ఆర్టీసీ యాజమాన్యం ఏర్పాటు చేసిందని, అప్పట్లో రూ.1.5 కోట్లతో పరిపాలనా భవనం, గ్యారేజీ, బస్‌కాంప్లెక్సు నిర్మించారన్నారు. లీజు ఒప్పందం ముగియడంతో ఆస్థలాన్ని ఖాళీ చేయాలని స్టీల్ ప్లాంట్ యాజమాన్యం నోటీసులు ఇచ్చిందని, గడువు పొడిగించాలంటే రూ.138 కోట్లు చెల్లించాలని పేర్కొందని వివరించారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని గతంలోని ఒప్పందం మేరకే డిపోను కొనసాగించేలా సహకరించాలని కోరారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు వినతిపత్రం ప్రతులను అందజేశారు. పీళ్లా శంకరరావు, సాయిరాం పాల్గొన్నారు.

రక్తమోడిన రహదారి


ప్రమాదానికి గురైన వాహనాలు


అంబులెన్స్‌లో క్షతగాత్రుడికి ధైర్యం చెబుతున్న హోం మంత్రి అనిత

- కొక్కిరాపల్లి వద్ద ఘోర ప్రమాదం
- ఆగి ఉన్న ఆటోను ఢీకొన్న టాటా మ్యాజిక్
- ఇద్దరి మృతి, ఎనిమిది మందికి తీవ్ర గాయాలు
- సహాయక చర్యల్లో హోం మంత్రి అనిత

ఎలమంచిలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కిరాపల్లి వద్ద జాతీయ రహదారిపై సోమవారం ఆగి ఉన్న ఆటోను టాటా మ్యాజిక్ ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందారు. ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు.

గాజువాక శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన బండి సాలేమ్‌రాజు ఏడుగురితో కలిసి టాటా మ్యాజిక్ వాహనంలో కాకినాడ జిల్లా పిఠాపురం బయలుదేరారు. ఉదయం 10.20 గంటలకు కొక్కిరాపల్లి ప్రేమసమాజం వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న లారీని ఎడమ వైపు నుంచి ఓవర్‌టేక్ చేసే క్రమంలో డ్రైవర్ కె.నానిబాబు ఆగి వున్న ఆటోను ఢీకొన్నాడు. సీఐ ధనుంజయరావు, ఎస్ఐ ఉపేంద్ర చేరుకుని, వాహనాల్లో ఇరుక్కుపోయిన వారికి బయటకు తీశారు. ఆటోలో ప్రయాణిస్తున్న కశింకోట మండలం తీడ గ్రామానికి చెందిన ఆరుగురు, టాటా మ్యాజిక్‌లోని బండి జాస్మిన్, బండి కరుణ, బండి ఆనంద విజయ, బండి అబ్బాయిలకు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ కె.నానిబాబు, బండి నరసింగరావు అలియాస్ సాలేమ్‌రాజు, నడిగట్ల విజయ, ఎస్.రాజ్‌కుమార్ స్వల్పంగా గాయపడ్డారు. అదే సమయంలో హోం మంత్రి వంగలపూడి అనిత నక్కపల్లి వెళుతూ కాన్వాయ్‌ను ఆపించి, క్షతగాత్రులను ఆస్పత్రుల కు తరలించేలా చర్యలు చేపట్టారు. అనకాపల్లి పంపిన క్షతగాత్రుల్లో గొంది పెంటయ్య (56), బాదంపూడి లక్ష్మి(65) చికిత్స పొందుతూ మృతిచెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు.

నకిలీ బ్యాంకు అకౌంట్లు అందించిన ఇద్దరి అరెస్టు

ఎండాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ కేంద్రంగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠాలకు నకిలీ బ్యాంకు అకౌంట్లు ఓపెన్ చేసి అందించిన ఇద్దరు యువకులను సైబర్ క్రైమ్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బెట్టింగ్ ముఠాల ఆర్థిక లావాదేవీల నిర్వహణకు బ్యాంక్ ఖాతాలు అవసరం. మధురవాడకు చెందిన బోనెల మాధవ (23), హరియాల శ్రీకాంత్ (28) బ్యాంక్ అకౌంట్స్‌ను సైబర్ నేరగాళ్లకు అందిస్తున్నారన్న పక్కా సమాచారంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా 35 అకౌంట్లు తెరిచి భారీ మొత్తంలో కమీషన్ తీసుకున్నట్టు అంగీకరించారు. కరూర్ వైశ్యా బ్యాంక్, ఏపీజీవీబీ, కర్ణాటక బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో ఖాతాలు తెరిచి వాటి వివరాలను చత్తీస్‌ఘడ్‌లోని భిలాయ్‌కి చెందిన ప్రేమ్ అనే వ్యక్తికి తర్వాత ఢిల్లీకి చేరవేశారు. పోలీసులు ఇద్దరు యువకులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

10 నుంచి అఖిల భారత పోస్టల్ టేబుల్ టెన్నిస్


టోర్నమెంట్ లోగో ఆవిష్కరిస్తున్న పోస్ట్‌మాస్టర్ జనరల్ జయశంకర్

ఎంవీపీ కాలనీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల పదో తేదీ నుంచి 14 వరకూ 40వ అఖిల భారత పోస్టల్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ విశాఖలో నిర్వహించనున్నట్టు విశాఖ ప్రాంతీయ పోస్ట్‌మాస్టర్ జనరల్ వీఎస్ జయశంకర్ తెలిపారు. ఎంవీపీ కాలనీలోని తపాలా శాఖ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎంవీపీ కాలనీలోని ఎస్ 3 స్పోర్ట్స్ ఎరీనాలో పోటీలు నిర్వహిస్తామన్నారు. అనంతరం టోర్నమెంట్ లోగో, టీజర్‌ను ఆవిష్కరించారు. దేశంలోని తపాలా శాఖ 14 సర్కిళ్ల నుంచి 121 మంది క్రీడాకారులు పాల్గొంటారని, మెన్స్ సింగిల్స్, డబుల్స్, విమెన్స్ సిగిల్స్, డబుల్స్ పోటీలు జరుగుతాయన్నారు. డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఎన్‌వీఎస్ఎన్‌రాజు, డిప్యూటీ సూపరింటెండెంట్ కోమల్‌కుమార్, రీజనల్ ఆఫీసు అసిస్టెంట్ డైరెక్టర్ కేవీడీ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌లో ఆరు నెలల్లో రూ.5,634 కోట్ల రుణాలు

- ఏపీ రాజధానిపై స్పష్టతతో పెరగనున్న వ్యాపారం
- ఎల్‌ఐసీ హౌసింగ్ ఎండీ, సీఈఓ త్రిభువన్ అధికారి



విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లోని తొలి ఆరు నెలల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో కూడిన దక్షిణ రీజియన్‌లో రూ.5,634 కోట్ల హౌసింగ్ రుణాలు ఇచ్చినట్టు ఎల్‌ఐసీ హౌసింగ్ ఎండీ, సీఈఓ త్రిభువన్ అధికారి తెలిపారు. రీజనల్ సమావేశానికి విశాఖపట్నం వచ్చిన ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. సంస్థ దేశవ్యాప్తంగా ఇచ్చే రుణాల్లో దక్షిణ రీజియన్ వాటా 25 శాతంగా ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సరం (2024-25) ఈ రీజియన్‌లో రూ.13,050 కోట్ల రుణాలు పంపిణీ చేశామన్నారు. ఈ ఏడాది రూ.15 వేల కోట్లు ఇచ్చే అవకాశం ఉందన్నారు. ఏపీలో గత ప్రభుత్వం రాష్ట్ర రాజధాని విషయంలో పెట్టుబడిదారులను డైలమాలో పెట్టిందని, ఇప్పుడు ప్రభుత్వం మారిన తరువాత స్పష్టత వచ్చినందున గృహ నిర్మాణం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. సంస్థకు రుణగ్రహీతల నుంచి రూ.63 వేల కోట్లు రావలసి ఉందన్నారు. సంస్థకు దేశవ్యాప్తంగా 303 మార్కెటింగ్ ఆఫీసులు ఉండగా, ఏపీలో మూడు క్లస్టర్లు, 20 ఏరియా కార్యాలయాలతో పటిష్టమైన నెట్‌వర్క్‌తో పనిచేస్తున్నామన్నారు.

ప్రాథమిక అంశాలపై అవగాహన అవసరం


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్, కళాశాలల ప్రిన్సిపాళ్లు

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కెరియర్ ప్లానింగ్ డెవలప్‌మెంట్ సెంటర్ (సీడీపీసీ)ను సోమవారం ప్రారంభించారు. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ సీడీపీసీ వివరాలతో కూడిన బ్రోచర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఉద్యోగాల కల్పనకు ప్రాథమిక అంశాల్లో జ్ఞానం కీలకమన్నారు. సంస్థల ఆలోచనావిధానంలో మార్పులు వస్తున్నాయని, అందుకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను, సామర్థ్యాలను వృద్ధి చేసుకోవాలన్నారు. కోర్సులో చేరినప్పటి నుంచి భవిష్యత్తుపై నిర్దిష్ట ప్రణాళికతో సాగాలన్నారు. ప్రాథమిక సాంకేతిక అంశాలపై అవగాహన, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, సరైన దృక్పథంతో సాగడం, నేర్చుకునే మనస్తత్వం, ఆసక్తి కలిగిన రంగంలో పనిచేసే తత్వం, ప్రాజెక్టుల్లో అనుభవ పూర్వక జ్ఞానాన్ని పొందడం కెరియర్ ప్లానింగ్‌లో కీలకమన్నారు. ఇందుకోసం విభాగం, క్లస్టర్, వర్సిటీ స్థాయిలో మార్గదర్శకాలను సిద్ధం చేశామన్నారు. ఉద్యోగ నియామానికి వెళ్లే సమయంలో మంచి సీజీపీఏ కలిగి ఉండడం, కమ్యూనికేషన్‌స్కిల్స్ ప్రభావాన్ని చూపుతాయ న్నారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వీఆర్‌రెడ్డి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు అందిం చేందుకు చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ పి. కింగ్, ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ జి.శశిభూషణరావు, ఎ.నరసింహారావు, జి.గిరిజా శంకర్, ఎంవీఆర్ రాజు, కె.సీతామాణిక్యం, ఆర్.పద్మశ్రీ, డి. నాగరాజుకుమారి పాల్గొన్నారు.

లా కాలేజీలో ఓరియంటేషన్ ప్రొగ్రామ్

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కాలేజీలో 2025-26 విద్యాలో చేరిన విద్యార్థులకు సోమవారం ఇండక్షన్, ఒరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎస్ఎన్ఎల్‌యూ వ్యవస్థాపక వైస్ చాన్సలర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వై సత్యనారాయణ హాజరయ్యారు. ప్రతి విద్యార్థి సామాజిక న్యాయవాదులుగా ఎదగాలన్నారు. లా కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. సీతామాణిక్యం, విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ ఎస్‌పాల్ డగ్లస్ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏయూ ఫెన్సింగ్ జట్టు ఎంపిక

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏయూ పెన్సింగ్ పురుషులు, మహిళల విభాగాల జట్ల ఎంపిక ప్రక్రియ పూర్తయింది. ఈనెల 5 నుంచి పదో తేదీవరకు గురునానక్‌లో జరిగే ఆలిండియా ఇంటర్ వర్సిటీ పోటీల్లో ఈ జట్లు పాల్గొటాయని డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎన్.విజయ్ మోహన్ తెలిపారు.

16న శెట్టిబలిజల వన సమారాధన

వెంకోజీపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16న రాష్ట్రమంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో అమలాపురంలో నిర్వహించనున్న ఉభయ రాష్ట్రాల శెట్టిబలిజల కార్తీకమాస వనసమారాధనను విజయవంతం చేయాలని సంఘం ప్రతినిధులు చొల్లంగి వెంకటరమణ , కుడిపూడి సామ్రాట్, 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్యలు పిలుపునిచ్చారు. సోమవారం ఎల్లమాంబ నగర్‌లోని కార్పొరేటర్ ఇంటి వద్ద జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. విశాఖ నుంచి దాదాపు 100 కార్లు, 5 బస్సులలో వెళ్లనున్నట్టు తెలిపారు. వనభోజనాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇసుకకొండ ఆలయంలో కార్తీక పౌర్ణమికి ఏర్పాట్లు



సత్యనారాయణస్వామి ఆలయం

మహారాణిపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) ఇసుక కొండ సత్యనారాయణ స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి టి.రాజగోపాలరెడ్డి తెలిపారు. విశాఖలో పౌర్ణమి ఆలయంగా పేరొందిన కేజీహెచ్ సమీపంలోని ఇసుకకొండ రమా సత్యనారాయణ స్వామి ఆలయానికి ఏటా కార్తీక పౌర్ణమి రోజు భక్తులు పెద్దసంఖ్యలో తరలి రానున్నారు. ఈ క్రమంలో ఆలయంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని మంగళవారం అర్ధరాత్రి దాటాక ఒంటిగంటకే తెరిచి స్వామివారి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు ముగించి బుధవారం వేకువన 3 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు భక్తులకు స్వామి దర్శనం కల్పించనున్నట్లు వివరించారు. ఉదయం 4 గంటలకు ధ్వజస్తంభం పూజ నిర్వహిస్తామన్నారు. ఉదయం 5, 7, 8.30, 10.30 గంటల సమయంలో ప్రత్యేక వ్రతాలు చేయిస్తామని పేర్కొన్నారు.

9న మాధవధారలో ట్రెక్కింగ్

మాధవధార, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాధవధార కొండమెట్ల దారిలో ఈ నెల 9న ట్రెక్కింగ్ నిర్వహించనున్నట్లు యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నగర ఛైర్మన్ ఎ.పుండరీకాక్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిదేళ్ల వయస్సు నిండిన ఆరోగ్యవంతులు ఎవరైనా ట్రెక్కింగ్‌లో పాల్గొనవచ్చని సూచించారు. ఉదయం 6.30 గంటలకు ట్రెక్కింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్; 99494 82818 నంబరులో సంప్రదించాలని కోరారు.

ద్విచక్ర వాహనం దగ్ధం



జ్ఞానాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురంలోని సెబాస్టియన్ కాలనీలో ఇంటిముందు నిలిపి ఉంచిన స్కూటీ (ద్విచక్రవాహనం)ను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి తగులబెట్టారు. వాహన యజమాని ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేసుకొని ఘటనా స్థలాన్ని, చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.3 లక్షల పరిహారం

మహారాణిపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): హిట్ అండ్ రన్ కేసులో మృతిచెందిన వ్యక్తి భార్యకు, గాయపడిన మరో ఇద్దరికి రూ.3 లక్షలు పరిహారం అందజేశారు. విశాఖ నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రం ద్వారా బాధితులకు సోమవారం ఈ మొత్తం అందజేశారు. వడ్డాది మాడుగుల ప్రాంతానికి చెందిన కోటేశ్వరరావు ఇటీవల హిట్ అండ్ రన్ ఘటనలో మృతిచెందాడు. ఆయన భార్య కొండ లక్ష్మికి రూ.2 లక్షలు చెల్లించగా, గాయపడిన చిలకలపూడి సురేష్, ఇమంది లక్ష్మణరావులకు రూ.50 వేల వంతున అందజేశారు.

మత్స్యకారులకు రేషన్

కంచరపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో మత్స్యకారులకు ప్రభుత్వం విడుదల చేసిన ఉచిత రేషన్, నిత్యావసర సరుకుల పంపిణీ కూటమి నాయకుల పర్యవేక్షణలో చురుగ్గా జరుగుతోంది. జీవీఎంసీ 55వ వార్డులోని గంగన్న నగర్ 121వ డిపో వద్ద క్లస్టర్ ఇన్‌ఛార్జి ఈతల పాక సుజాత అర్హులకు రేషన్ అందజేశారు. మత్స్యకారులు ఇబ్బంది పడకూడదనే ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబు వారికి బియ్యం, పంచదార, కందిపప్పు, వంటనూనె, ఉల్లి, టమాట, బంగాళదుంపలు అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్లు గంట్యాడ వీరుబాబు, లీలావతి, సుధ, చిన్నారెడ్డి, ఈశ్వరరావు పాల్గొన్నారు.



పార్వతీశ్వరాలయంలో మహాశివలింగం



శివపూజలో పాల్గొన్న భక్తులు



నక్కవానిపాలెంలో..



రెడ్డికంచరపాలెంలో..

శివాలయాల్లో కార్తీక శోభ

కంచరపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండో సోమవారం శైవాలయాలు శివ నామస్మరణతో మారుమోగాయి. గొల్లకంచరపాలెం, ఆర్పీపేట, తిక్కవానిపాలెం, గంగన్న నగర్, రెడ్డికంచరపాలెం తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. కార్తీక మాసం ప్రాధాన్యతను అర్చకులు వివరించారు. అనంతరం విశిష్ట అలంకరణ, హారతి కన్నుల పండువగా చేపట్టారు.

ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో...

సీతమ్మధార, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార నక్కవానిపాలెంలో గల ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో మహా శివలింగానికి పంచామృతం, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఈఓ బండారు ప్రసాద్ పర్యవేక్షణలో అర్చకులు రామారావు శర్మ, మహేష్ శర్మలు భక్తుల గోత్రనామాలతో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు శివనామస్మరణ చేసుకున్నారు.

పార్వతీశ్వరాలయంలో..

సీతంపేట గణేష్‌నగర్‌లో గల పార్వతీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శివాజి శర్మ, భాస్కర్ శర్మల బృందం వేదమంత్రాలతో అభిషేకాలు, పుష్పాలతో పూజ చేశారు. మహా శివలింగాన్ని అలంకరించారు. భక్తులు దీపాలు వెలిగించారు.

ఏఎంసీలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



వేదికపై ఆశీనులైన ప్రముఖులు

మహారాణిపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర వైద్య కళాశాల (ఏఎంసీ)లో ఆహ్వాన్-2025 పేరుతో సోమవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేజీహెచ్‌లోని కాబ్ ఆడిటోరియంలో నూతనంగా వచ్చిన విద్యార్థులను స్వాగతించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్, కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఫ్రెషర్స్ డే ద్వారా విద్యార్థులలో స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని, కొత్త విద్యార్థులు క్రమశిక్షణ, విలువలు, సృజనాత్మక ఆవిష్కరణలతో ముందుకు సాగాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, డాక్టర్ వాసవిలతా, డాక్టర్ శ్రీహరి, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

పీ4 కార్యాలయంలో ప్రజాదర్బార్



ప్రజల వినతులు పరిశీలిస్తున్న ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, అధికారులు

మాధవధార, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం ఇక నుంచి మాధవధార స్వర్ణాంధ్ర-2047 (పీ4) కార్యాలయంలో ప్రజా సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తానని ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు. సోమవారం తొలిసారి ప్రజల నుంచి లిఖితపూర్వక వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే, అక్కడే ఉన్న జోన్-5 జెడ్సీ బి.రాము, టౌన్‌ప్లానింగ్, తాగునీటి విభాగం అధికారులకు సమస్యల పరిష్కార బాధ్యతను అప్పగించారు. తీసుకున్న చర్యలపై తనకు నివేదించాలని అధికారులను ఆదేశించారు. 50వవార్డు సాయిరాంనగర్ వాసులు తుఫాన్ కారణంగా తమ నివాసిత ప్రాంతంలో దెబ్బతిన్న వీధి దీపాలు, డ్రైనేజీ సమస్యలపై వినతులు సమర్పించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జోన్-5 ఏపీడీలు పుణ్యవతి, పద్మావతి, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల కల్యాణోత్సవం



అల్లిపురంలో గౌరీ పరమేశ్వరుల విగ్రహాలు



ఏఎస్సార్‌నగర్‌లో

అల్లిపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అల్లిపురం వేంకటేశ్వరమెట్ట వద్ద గౌరీ సేవాసంఘం, వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో 78వ గౌరీపరమేశ్వరుల లీలా మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం గౌరీ పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిపారు. వేద మంత్రాల నడుమ గౌరీపరమేశ్వరులను పెళ్లికొడుకు, పెళ్లికూతురుగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పొలమరశెట్టి వెంకటశ్యామ్ కుమార్, పొలమరశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బర్మాక్యాంప్ ఏఎస్సార్ నగర్‌లో..

మురళీనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బర్మాక్యాంప్ ఏఎస్సార్ నగర్‌లో గౌరీ పరమేశ్వర ఉత్సవ మండపంలో సోమవారం మహిళల సామూహిక గీతాలాపన, ప్రత్యేక కాశీ శివలింగ పూజలు నిర్వహించారు. స్థానిక జైలాల్ అల్లూరి గౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలో ఈ నెల 8 వరకు శివపార్వతుల ఉత్సవాలు జరపనున్నట్లు సంఘం అధ్యక్షుడు కె.శివఅప్పారావు తెలిపారు. గౌరీ పరమేశ్వరుల ప్రతిమల వద్ద స్థానికులు పూజలు నిర్వహించారు. సోమవారం సాయంత్రం సంకీర్తనల కోలాటం, అనంతరం ప్రత్యేక కాశీ శివలింగ పూజలు నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.పాపారావు, కోశాధికారి పి.గోపి, ఉపాధ్యక్షులు ఎస్.వెంకరావు తదితరులు హాజరయ్యారు. కార్తీక మాసం కావడంతో సమీప ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు శివపార్వతుల పూజల్లో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మోడల్ ఎక్స్‌పో



బుల్లయ్య కళాశాల కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్‌కు ప్రాజెక్టు నమూనా పనితీరును వివరిస్తున్న విద్యార్థులు

సీతమ్మధార, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పవర్ సిస్టమ్ జనరేటింగ్ స్టేషన్స్ మోడల్ ఎక్స్‌పో, స్కిల్ స్వాప్ ఆధారిత ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ల్యాబ్‌ను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎక్స్‌పోను ప్రారంభించారు. బీటెక్ విద్యార్థులు థర్మల్, న్యూక్లియర్, గ్యాస్, హైహెడ్ అండ్ లోహెడ్ హైడ్రో పవర్ ప్లాంట్స్, ఎనర్జీ ఆడిట్ వంటి విద్యుదుత్పత్తి స్టేషన్లకు సంబంధించిన నమూనాలు ప్రదర్శించారు. విద్యుదుత్పత్తి, ప్రసార విధానాలు, పునరుత్పాదక శక్తి సమన్వయాలను స్పష్టంగా విద్యార్థులు తమ నమూనాల ద్వారా చూపించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.మధుకుమార్ మాట్లాడుతూ ఎల్‌ఒటి పునరుత్పాదక శక్తి, స్మార్ట్ గ్రిడ్లు, భవిష్యత్ విద్యుత్ రంగానికి అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.దీపక్ చౌదరి, విభాగాధిపతి డాక్టర్ ఆనంద్ గోందేసి, ఇతర విభాగాధిపతులు డాక్టర్ జి.టి.నాయుడు, డాక్టర్ జె.బాబు, డాక్టర్ డి.మాధవి తదితరులు విద్యార్థులను అభినందించారు.

పవర్ లిఫ్టింగ్ ఓవరాల్ చాంప్ బుల్లయ్య జట్టు



ట్రోఫీ, ప్రశంసాపత్రాలతో క్రీడాకారులు

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏయూ అంతర్ కళాశాలల పవర్ లిఫ్టింగ్ టోర్నీలో లంకపల్లి బుల్లయ్య కళాశాల పురుషులు, మహిళల విభాగాల్లో ఓవరాల్ చాంపియన్ ట్రోఫీలను కైవసం చేసుకుంది. రన్నరప్‌గా పురుషుల విభాగంలో అనిట్స్ కళాశాల, మహిళల విభాగంలో శ్రీనివాసరావు ఫార్మసీ కళాశాల నిలిచాయి. బుల్లయ్య కళాశాలలో జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమానికి పవర్ లిఫ్టింగ్ ఇంటర్నేషనల్ మెడలిస్టు డి.అనూష గౌడ్, సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ కార్యదర్శి సకల కోటేశ్వరరావు, ఛైర్మన్ మద్ది ప్రభాకర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు, పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహక కార్యదర్శి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరక్టర్ డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి, కోచ్ డాక్టర్ వీఎల్ఎన్.రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులకు బంగారు పతకాలు

మహారాణిపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర వైద్య కళాశాల (ఏఎంసీ) రేడియాలజీ విభాగం విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. గీతం విశ్వవిద్యాలయంలో నిర్వహించిన రేడియాలజీ సదస్సులో పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థులకు నిర్వహించిన పరిశోధనా పత్రాలు, పరిశోధన పత్రికల ప్రదర్శనలో ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థులు అద్భుతంగా రాణించారు. రాష్ట్ర స్థాయిలో 180 పత్రికల పరిశోధన, ప్రదర్శనకు అనుమతి లభించగా జి.పుష్పిత ప్రథమ స్థానం కైవసం చేసుకుని సబ్ చాప్టర్ బంగారు పతకం సాధించారు. డాక్టర్ జయగురు సంబతరాజన్, డాక్టర్ రాజారెడ్డిలు కూడా బంగారు పతకాలు సాధించారు. డాక్టర్ మేఘనా ప్రశంసా పత్రాన్ని పొందారు. ఈ సందర్భంగా ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, సూపరింటెండెంట్ డాక్టర్ ఐ వాణి, రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ బుజ్జిబాబు, ఫ్యాకల్టీ, తోటి విద్యార్థులు పతక సాధకులను అభినందించారు.



బంగారు పతకాలు పొందిన విద్యార్థులతో ఏఎంసీ ప్రిన్సిపాల్ సంధ్యాదేవి తదితరులు

అనుమతిలేని సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహం తొలగింపు



జగదాంబ జంక్షన్‌లో కృష్ణ విగ్రహం తొలగిస్తున్న దృశ్యం

మహారాణిపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జగదాంబ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహాన్ని తొలగించారు. గత నెల 26న జగదాంబ జంక్షన్‌లో ప్రఖ్యాత సినీనటుడు ఘట్టమనేని కృష్ణ విగ్రహాన్ని జనసేన నాయకుడు, గ్రేటర్ విశాఖ సిటీవైడ్ సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్ బాబుల అభిమాన సంఘం, సరస్వతీ పార్కు కమిటీ అభిమానుల సంఘం నాయకుడు మన్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అయితే ఈ విగ్రహం ఏర్పాటుకు జీవీఎంసీ, ఇతర ఏ ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు లేవు. కృష్ణ మరణించిన తరువాత ఆయన విగ్రహం ఏర్పాటు చేసేందుకు అభిమానులు ఏడాదికాలంగా కలెక్టరేట్‌లోనూ, జీవీఎంసీ కార్యాలయంలోనూ అవసరమైన పత్రాలు సమర్పించారు. అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ఈ నెల 15న కృష్ణ రెండో వర్ధంతి జరుపుకోనున్న క్రమంలో కృష్ణ, మహేష్‌బాబుల అభిమాన సంఘం ప్రతినిధులు విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇదే స్థలంలో జనసేన పార్టీకి చెందిన జెండా దిమ్మ ఉందని, దానిని తొలగించి విగ్రహం ఏర్పాటు చేయడంతో జనసైనికుల మనోభావాలు దెబ్బతిన్నాయని, తొలగించకపోతే కోర్టును ఆశ్రయిస్తామని జనసేన నాయకుడు బొలిశెట్టి సత్యనారాయణ గతంలో హెచ్చరించారు. విగ్రహాన్ని తొలగించాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ కలెక్టర్, పోలీసు కమిషనర్, జీవీఎంసీ కమిషనర్‌లకు ఫిర్యాదు చేశారు. దీనితో సోమవారం క్రేన్ల సహాయంతో విగ్రహాన్ని తొలగించారు. దీనిపై కృష్ణ అభిమానులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ జనసేన జెండా దిమ్మను తొలగించలేదని, విగ్రహం పక్కనే దిమ్మ ఉందని తెలిపారు. గతంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా కృష్ణ విగ్రహం ఏర్పాటుకు అంగీకరించారని, ఎవరికీ ఎలాంటి ఇబ్బంది ఉండదనే ఉద్దేశంతోనే విగ్రహం ఏర్పాటు చేశామని కృష్ణ అభిమానులు పేర్కొన్నారు.

వెలుగులివ్వని హైమాస్ట్ లైట్లు..!?



ఆర్‌అండ్‌బి జంక్షన్‌లో వెలుగుతూ ఆరిపోయే హైమాస్ట్ ఇది

మురళీనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గంలో హైమాస్ట్ దీపాల పేరిట ప్రజాధనం వృథా చేస్తున్నారు. వార్డుల్లో నాయకులు పోటీపడి కొత్త హైమాస్ట్ దీపాలు వేసినా, అవి నిరుపయోగంగా మారాయి. తుప్పు పట్టిన 20 అడుగుల స్తంభాలపై దిష్టి బొమ్మల్లా దీపాలు దర్శనమిస్తున్నాయి. ఒక్కో స్తంభంపై ఉండే ఎనిమిది దీపాలు వెలగకున్నా, ఎవరూ పట్టించుకోవడంలేదు. 51వవార్డులోని ఆర్‌అండ్‌బీ జంక్షన్ రోడ్డు, ఎయిర్ పోర్టు పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న లైట్లు ఎక్కడ ఉన్నాయో గుర్తించడమే కష్టంగా మారింది. ఆర్‌అండ్‌బి జంక్షన్ జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్‌ఐ) కార్యాలయం ప్రహరీని ఆనుకొని ఉన్న హైమాస్ట్ దీపం ఏడాదిగా తుప్పు పట్టి నామరూపాల్లేకుండా పోయింది. స్తంభంపై ఒక్క లైటూ వెలగడం లేదు. ఎస్‌పీడీ, ఊర్వశి జంక్షన్‌ల వైపు వెళ్లే దారులతో పాటు ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ మీదుగా మాధవధార ఉడాకాలనీకి చేరే మూడు రోడ్ల జంక్షన్‌లో ఉన్న ఈ హైమాస్ట్ దీపాలు వెలగక వాహనదారులు చీకటిలోనే ముందుకు సాగుతున్నారు. మూడు వైపుల నుంచి దూసుకొచ్చే వాహనాలు ప్రమాదాలకు గురికాకుండా వేసిన హైమాస్ట్ దీపస్తంభం ఎంతో ఉపయోగకరం. వీధి దీపాల నిర్వహణ విభాగం, స్థానిక కార్పొరేటరు, సచివాలయ సిబ్బందికి ఈ దీపాలు వెలిగించే ఆసక్తి లేదు. ఆరు నెలల క్రితం ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఎదుటే హైవే సెంటరు డివైడరుపై వేసిన 8 దీపాలు వెలుగుతూ, ఆరుతూ డిస్కో లాంప్‌లా మారింది. ప్రతి రెండు నిమిషాలకు లైటు దానంతట అదే ఆగిపోయి, మళ్లీ వెలుగుతుండడంతో వాహనదారులు తికమక పడుతున్నారు. సర్వీసు రోడ్డు నుంచి ఇక్కడి హైవేసెంటరు కారిడార్‌కు మలుపు ఉండటంతో మలుపు తీసుకునే వాహనదారులకు ఈ వెలుగులు నిరుపయోగంగా మారుతున్నాయి.

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం సోమవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు.

నేవల్ ప్రాజెక్టు డీజీగా కె.శ్రీనివాస్

... 5వ పేజీ తరువాయి

విరాట్‌లో వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. ఐఎన్ఎస్ విక్రమాదిత్యకు రష్యాలో మరమ్మతులు చేయాల్సి వచ్చినప్పుడు సూపరింటెండెంట్‌గా వెళ్లారు. యుద్ధ విమాన వాహక నౌకల ప్రాజెక్టుకు ప్రిన్సిపల్ డైరెక్టర్‌గా పనిచేశారు.

పదోన్నతుల కోసం పైసా వసూల్

... 5వ పేజీ తరువాయి

వెల్లువెత్తుతున్నాయి. పదోన్నతి పొందిన ప్రతి ఒక్కరూ సొమ్ములు ఇవ్వాల్సిందేనని దబాయించారని కొందరు ఉద్యోగులు అంటున్నారు. సొమ్ముల వ్యవహారంపై కొందరు సిబ్బంది ఆప్కాబ్‌కు ఫిర్యాదులు చేశారని చెబుతున్నారు. కాగా ఈ ఆరోపణలను బ్యాంకు సీఈవో డీవీఎస్ వర్మ వద్ద ప్రస్తావించగా ఆప్కాబ్ నిబంధనలు, మార్గదర్శకాల మేరకూ పదోన్నతులు కల్పించామన్నారు. మెరిట్, రోస్టర్ మేరకు ఇంటర్వ్యూకు వచ్చే అభ్యర్థుల జాబితా తయారుచేశామన్నారు. పదోన్నతులు పారదర్శకంగా చేపట్టామని పేర్కొన్నారు.

పెరుగుతున్న చికున్‌గున్యా బాధితులు

... 5వ పేజీ తరువాయి

వైద్యులు చెబుతున్నారు.

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

వారం, పది రోజులుగా రోజుకు రెండు, మూడు కేసులు వస్తున్నాయి. ఎక్కువమం దిలో జాయింట్ పెయిన్స్ తీవ్రంగా ఉంటున్నాయి. పెయిన్ కిల్లర్స్ వాడకూడదు. వైద్యుల సలహా మేరకు మందులు వినియోగించాలి. లక్షణాలను బట్టి చికిత్స ఉంటుంది. చికున్ గున్యా బారినపడిన వారందరికీ జాయింట్ పెయిన్స్ ఉండవు. కొందరికి తీవ్రమైన తలనొప్పి, వాంతులు, వికారం ఉంటాయి. దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

- డాక్టర్ వై.జ్ఞానసుందరరాజు, జనరల్ ఫిజీషియన్

నిలిచిన కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు!

... 5వ పేజీ తరువాయి

ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో చాలామంది చిన్నారులకు వయసు దాటిపోతోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి వెంటనే ప్రక్రియను ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

నెలకు ఆరు నుంచి ఎనిమిది..

కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సలను పెదవాల్తేరులోని ప్రభుత్వ ఈఎన్‌టీ, గాయత్రీ ఆస్పత్రిలో నిర్వహిస్తున్నారు. ఈ రెండు ఆస్పత్రుల్లో నెలకు ఆరు నుంచి ఎనిమిది వరకు నిర్వహిస్తుంటారు. ఈ శస్త్ర చికిత్స నిర్వహించడానికి ముందు చిన్నారికి ఆస్పత్రి అధికారులు పరీక్షలు నిర్వహించి, అనంతరం అమర్చాల్సిన పరికరం కోసం ఎన్‌టీఆర్ వైద్య సేవ ట్రస్టుకు ఇండెంట్ పెడతారు. ప్రభుత్వమే ఆయా పరికరాలను కొనుగోలు చేసి ఆస్పత్రులకు సరఫరా చేస్తుంది. ఒకేసారి నెలకు ముగ్గురు, నలుగురు చిన్నారులకు అవసరమైన పరికరాల కోసం అధికారులు ఇండెంట్ పెడుతూ ఉంటారు. ఇలా పరికరాలు వచ్చిన తరువాత చిన్నారులకు శస్త్రచికిత్సలను నిర్వహిస్తారు. శస్త్రచికిత్స అనంతరం సదరు చిన్నారులకు స్పీచ్ థెరపీ వంటివి చేయడం ద్వారా సాధారణ స్థితికి తీసుకువస్తారు. ఈ శస్త్రచికిత్సను బయట చేయించుకోవాలంటే సుమారు రూ.8 లక్షలు నుంచి రూ.12 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ప్రభుత్వమే ఈ మొత్తాన్ని భరించి ఎన్‌టీఆర్ వైద్య సేవలో చేస్తుండడంతో ఎంతోమంది చిన్నారులకు మేలు చేకూరుతోంది. ఈ శస్త్ర చికిత్సల కోసం ఇటు ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన చిన్నారులు నగరంలోని ఆస్పత్రులకు వస్తుంటారు. ఇప్పుడు వారంతా మళ్లీ ఈ ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుందా?...అని ఎదురుచూస్తున్నారు.

కొత్త డీఎస్సీకి విద్యా శాఖ కసరత్తు

... 5వ పేజీ తరువాయి

పరిధిలో 400 ఖాళీలు, ప్రభుత్వ, జడ్పీ పరిధిలోని పాఠశాలల్లో సుమారు 150 ఖాళీలను తాజా డీఎస్సీ ద్వారా భర్తీచేశారు. ఇంకా ఏజెన్సీతోపాటు మైదానంలో ఎస్జీటీ, స్కూలు అసిస్టెంట్ కేటగిరీల్లో ఖాళీలు ఉన్నాయి. అదేవిధంగా ప్రతినెలా పలువురు టీచర్లు పదవీ విరమణ చేస్తున్నారు. 1989 నుంచి 1998 మధ్య డీఎస్సీ ద్వారా నియమితులైన పలువురు టీచర్లు ఈ ఏడాది నవంబరు, డిసెంబరు, వచ్చే ఏడాది మే నెలాఖరులోగా పదవీ విరమణ చేయనున్నారు. ఇంకా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పదవీ విరమణ చేయడంతో ఆయా పోస్టులకు స్కూలు అసిస్టెంట్లతో భర్తీచేయనున్నారు. దీంతో స్కూలు అసిస్టెంట్ కేటగిరీలో ఖాళీలు ఏర్పడనున్నాయి.

ఇదిలావుండగా ఉమ్మడి జిల్లాలో కొందరు టీచర్లు స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని వచ్చే ఏడాది మే నెలాఖరు నాటికి ఏర్పడబోయే ఖాళీల వివరాలను మండల విద్యాశాఖాధికారుల నుంచి జిల్లా విద్యా శాఖ సేకరిస్తోంది. వచ్చే ఏడాది మే నెలాఖరుకల్లా సుమారు 500 నుంచి 600 వరకు ఖాళీలు ఉండే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలు అంచనా వేస్తున్నాయి. మండలాల నుంచి పూర్తి వివరాలు వచ్చిన తరువాత గానీ ఖాళీలపై స్పష్టత రాదని అంటున్నారు. పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు వచ్చే ఏడాది మే నెలాఖరు వరకూ ఏర్పడబోయే ఖాళీల వివరాలు నివేదిక సిద్ధం చేస్తున్నామని విశాఖ డీఈవో నిమ్మక ప్రేమ్‌కుమార్ తెలిపారు.

రావుల చెరువును అభివృద్ధి చేయాలి

గాజువాక, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86వ వార్డులో ఉన్న రావుల చెరువును అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు టీడీపీ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ సోమవారం విన్నవించారు. యోగా కేంద్రాన్ని నిర్మించాలని,పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వార్డు సమస్యలు పరిష్కరించండి

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డులోని పలు గ్రామాలలో సమస్యలను పరిష్కరించాలని వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ సోమవారం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. చినయాతపాలెం, లక్కరాజుపాలెం, సాయిరాం నగర్ కాలనీ, ఉడానగర్‌లో తాగునీరు, విద్యుత్ దీపాలు, డ్రైనేజీలు, రహదారులు సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి

గాజువాక, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు అన్నారు. వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బావుల్లో లార్వా నిర్మూలనకు గుంబూషియా చేపలను వదిలారు.

మాక్ అసెంబ్లీకి జయంతి

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గాజువాక హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి రాజ్యాంగ దినోత్సవ పోటీల్లో మింది హైస్కూల్ విద్యార్థి పి.జయంతి ప్రథమ స్థానం సాధించింది. ఈనెల 26న విద్యాశాఖ నిర్వహించే మాక్ అసెంబ్లీలో పాల్గొనే అవకాశం దక్కింది. జయంతిని ఉపాధ్యాయులు అభినందించారు.

'సిమెంట్ పరిశ్రమ వద్దు'

పెదగంట్యాడ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ సమీపంలో అంబుజా సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వ ఇచ్చిన అనుమతులు తక్షణమే రద్దు చేయాలని 'విశాఖపట్నం అపార్టమెంట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వార్వా), గ్రేటర్ విశాఖ రెసిడెంట్స్ కాలనీ అసోసియేషన్స్ ఫెడరేషన్ (నివాస్), వాయిస్ ఆఫ్ గాజువాక, ప్రతినిధులు గంగవరం పోర్టు రోడ్డు వద్ద సోమవారం ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. వార్వా గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఎం.రమేశ్‌కుమార్, నివాస్ గాజువాక శాఖ అధ్యక్షుడు త్రినాథస్వామి, జిల్లా అధ్యక్షుడు బి.గురప్ప, లక్ష్మణస్వామి, చిక్కా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

వేపగుంట నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 93వ వార్డులో కార్పొరేషన్ నిధులు రూ.2.32కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు సోమవారం శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాపర్తికన్నా, జడ్సీ హెచ్.శంకరరావు, ఏఎమ్‌హెచ్‌ఓ. బండారు అప్పలనాయుడు, డీఈ ప్రవీణ్‌కుమార్, తదితర నాయకులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు 10 ఫిర్యాదులు

వేపగుంట నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 10 ఫిర్యాదులు అందాయి. శాఖాధిపతులకు పంపిస్తామని జడ్సీ హెచ్. శంకరరావు తెలిపారు.

సినిమా గైడ్

- **మాస్ జాతర** : జగదాంబ, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజి** కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి**: సౌజన్య(గోపాలపట్నం), ,

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 30, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 52, గుత్తి/రవి వంకాయలు 58, బెండకాయలు 54, పచ్చిమిర్చి 30, బజ్జి మిర్చి 40, కాకరకాయలు 36, బీరకాయలు 48, ఆనపకాయ 2, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 26, క్యారెట్ 58, దొండకాయలు 34, బంగాళదుంపలు 20, అరటికాయ7, మునక్కాడలు (కిలో) 94, అల్లం 66, బరబాటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 54, దోసకాయలు 38, పోటల్స్ 58, వెల్లుల్లి 65, కొబ్బరికాయ40, బీట్‌రూట్ 44, బీన్స్ 70, కీరదోస 22, కాప్సికమ్ 66, పొట్లకాయ 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 30, కంద 52, ముల్లంగి 34, దేముడుచిక్కుడు 66, గోరుచిక్కుడు 46, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230


సనత్‌నగర్ ఏకాంబేశ్వర ఆలయంలో భక్తుల పూజలు


జింక్ శివాలయంలో భక్తుల సందడి


పెదమడక శివాలయంలో పూజలు

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

గాజువాక, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా సనత్‌నగర్, వంటిళ్ల జంక్షన్, మామిడితోట శివాలయం, మోహర్‌నగర్, ఆదర్శ మైదానం, సమతానగర్ శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉక్కు శివాలయంలో...

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. లింగేశ్వరుడికి రుద్రాభిషేకాలు నిర్వహించారు. అన్నసమారాధన చేశారు.

అగనంపూడి పరిధిలో...

అగనంపూడి: కార్తీక సోమవారం సందర్భంగా అగనంపూడి ప్రాంతంలోని శివాలయాలు కిటకిటలాడాయి. వేకువజామునుంచే ప్రత్యేక పూజలు చేశారు. పెదమడక, పాత అగనంపూడి, కర్రివానిపాలెం, జాబిలి హిల్స్ ఆలయాల్లో అభిషేకాలు, అన్నసమారాధన నిర్వహించారు.

గోపాలపట్నంలో...

గోపాలపట్నం: గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఇందిరానగర్, నాగేంద్రకాలనీ, చంద్రనగర్, నరవ, ఎంఈఎస్ పంప్ హౌస్, బంక్ కూడలి శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు తరలివచ్చి పూజలు, అభిషేకాల్లో పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో...

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని ఆలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి. వేకువజామునుంచే భక్తులు శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పెదగంట్యాడలో...

పెదగంట్యాడ: పెదగంట్యాడ ప్రాంతంలో శివాలయాల్లో శివునికి సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. నెల్లిముక్కు, బాలచెరువు, దుర్గవానిపాలెం, ప్రియదర్శనీకాలనీ, బీసీ రోడ్డు, సిద్ధేశ్వరం, సీతానగరం, వికాస్‌నగర్ శివాలయాల్లో అభిషేకాలు చేశారు.

పెందుర్తి పరిధిలో...

పెందుర్తి: కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగ పెందుర్తి పరిసర ప్రాంతాల శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సరిపల్లి స్వయంభు శివాలయంలో స్వామివారికి 108 లీటర్లతో క్షీరాభిషేకం చేశారు. ప్రశాంతినగర్, పినగాడి, పాత పెందుర్తి, సుజాతనగర్, చినముషిడివాడ, శ్రమశక్తినగర్ ఉడా కాలనీ, ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రత్నగిరినగర్ విశాలక్షీ విశ్వేశ్వర శివాలయంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పూజలు చేశారు.

కూర్మన్నపాలెం పరిధిలో...

కూర్మన్నపాలెం: శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కణితి, వడ్లపూడి, ఆటోనగర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాతృశ్రీనగర్ విశ్వేశ్వర దేవాలయంలో దీపారాధన జరిగింది. కణితి కాళింగుల వీధి పంచముఖేశ్వర స్వామి ఆలయంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వడ్లపూడి శ్రీసీతారామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఐస్‌గడ్డలతో ఏర్పాటు చేసిన శివలింగాన్ని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. చట్టివానిపాలెం బాలా త్రిపుర సుందరి అమృత లింగేశ్వర స్వామిని వెండి నాగాభరణం, పూలమాలలతో సుందరంగా అలంకరించారు. తోకాడ శివాలయం స్పటిక లింగానికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు.

అక్కిరెడ్డిపాలెంలో...

అక్కిరెడ్డిపాలెం: కార్తీకమాసం రెండవ సోమవారం సందర్భంగా 68, 69 వార్డుల్లోని శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. షీలానగర్ కాశీవిశ్వేశ్వర ఆలయంలో ప్రధానార్చకులు శ్రీనుశర్మ అభిషేకాలు చేశారు. నాతయ్యపాలెం, అక్కిరెడ్డిపాలెం, తుంగ్లాం శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.


గోపాలపట్నం చంద్రమౌళీశ్వర పూజల్లో పాల్గొన్న భక్తులు


స్టీల్‌ప్లాంటు శివాలయంలో పూజలు



వడ్లపూడిలో ఐస్‌తో ఏర్పాటు చేసిన బ్రహ్మసూత్ర శివలింగం

ప్రతిఫలం ఆశించని సేవలు ప్రశంసనీయం

» కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

సాగర్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతిఫలం ఆశించకుండా ఉత్తమ సేవలందిస్తున్న లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కార్యక్రమాలు ప్రశంసనీయమని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సోమవారం రాడిసన్ బ్లూలో నిర్వహించిన ఫోర్బ్స్ ఇండియా పశ్చిమ, దక్షిణ జోన్‌ల అవార్డుల ప్రదానోత్సవానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లయన్స్ క్లబ్ దాతృత్వ, సేవా కార్యక్రమాలు చేస్తోందని, కాళ్లులేని 550 మందికి కృత్రిమకాళ్లు అందించిందన్నారు. క్లబ్‌లో తెలుగు వారు అత్యున్నతస్థాయి ప్రాతినిథ్యం వహించడం అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన సహకారం అందిస్తామన్నారు. దేశ కీర్తి ప్రతిష్ఠలు పెంచేది బీజేపీ మాత్రమేనన్నారు. ప్రధాని మోదీ విశాఖకు ప్రాధాన్యత ఇస్తారని, రూ.2 లక్షల కోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారన్నారు.విశాఖకు గూగుల్ డేటా సెంటర్ కేటాయించారన్నారు. అనంతరంవిద్య, నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత, పర్యావరణం, హెల్త్‌కేర్ రంగానికి చెందిన విజేతలు, రన్నరప్‌లకు మంత్రి, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, పల్లా శ్రీనివాసరావు, గౌతు శిరీష, లైన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రెజరర్ వేగేశ్న విజయ్ రాజు, లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ పి.సుభాష్‌బాబు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ కృష్ణంరాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



అవార్డులు ప్రదానం చేస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యేలు పల్లా, విష్ణుకుమార్ రాజు, గౌతు శిరీష, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

'ఉక్కు'లో ముగిసిన విజిలెన్స్ వారోత్సవాలు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సంస్థ ప్రగతిలో పారదర్శకత, నైతిక విలువలు ముఖ్య పాత్ర పోషిస్తాయని వీఎస్‌ఈజెడ్ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీనివాస్ ముప్పాల అన్నారు. ప్లాంటులో నిర్వహిస్తున్న విజిలెన్స్ వారోత్సవాల ముగింపు సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైతిక విలువలను ప్రోత్సహించే వ్యవస్థలు, విధానాలను బలోపేతం చేసేందుకు స్టీల్‌ప్లాంట్ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ అధికారి ఎస్.కరుణరాజు మాట్లాడుతూ పారదర్శక పాలన, గణనీయమైన సంస్కరణలు అమలు చేయడంలో స్టీల్‌ప్లాంటు తీసుకుంటున్న చర్యలు విశేషమన్నారు. అనంతరం ఇటీవల నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ డైరెక్టర్లు సలీం జి.పురుషోత్తమన్, జీవీఎస్.ప్రసాద్, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ డి.జితేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇనిస్టిట్యూట్ల ఏర్పాటుపై ఎమ్మెల్యేకు వినతి

ఆటోనగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ ఆర్థిక ఇబ్బందులతో అభివృద్ధికి నోచుకోని ఏపీ టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఓనర్స్ అసోసియేషన్‌కు సొంత ఇనిస్టిట్యూట్లు ఏర్పాటు చేసుకునేందుకు, ప్రభుత్వం నుంచి రాయితీలు కల్పించాలని ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసోసియేషన్ సిబ్బందికి వైద్య, ఆరోగ్య సదుపాయాలు ప్రభుత్వం కల్పించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే పల్లా ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ప్రాథమిక అంశాలపై అవగాహన అవసరం

» కెరియర్ ప్లానింగ్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కెరియర్ ప్లానింగ్ డెవలప్‌మెంట్ సెంటర్ (సీడీపీసీ)ను సోమవారం ప్రారంభించారు. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ సీడీపీసీ వివరాలతో కూడిన బ్రోచర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఉద్యో గాల కల్పనకు ప్రాథమిక అంశాల్లో జ్ఞానం కీలకమన్నారు. సంస్థల ఆలోచనావి ధానంలో మార్పులు వస్తున్నాయని, అందుకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను, సామర్థ్యాలను వృద్ధి చేసుకోవాలన్నారు. కోర్సులో చేరినప్పటి నుంచి భవిష్యత్తుపై నిర్దిష్ట ప్రణాళికతో సాగాలన్నారు. ప్రాథమిక సాంకేతిక అంశాలపై అవగాహన, సమ స్యలను పరిష్కరి ంచే సామర్థ్యం, సరైన దృక్ప థంతో సాగడం, నేర్చుకునే మనస్తత్వం, ఆసక్తి కలిగిన రంగంలో పనిచేసేతత్వం, ప్రాజెక్టుల్లో అనుభవ పూర్వక జ్ఞానాన్ని పొందడం కెరియర్ ప్లానింగ్‌లో కీలకమన్నారు. ఇందుకోసం విభాగం, క్లస్టర్, వర్సిటీ స్థాయిలో మార్గదర్శకాలను సిద్ధం చేశామన్నారు. ఉద్యోగ నియమానికి వెళ్లే సమ యంలో మంచి సీజీపీఏ కలిగి ఉండడం, కమ్యూనికేషన్‌స్కిల్స్ ప్రభావాన్ని చూపుతా యన్నారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వీఆర్‌రెడ్డి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు అందించేం దుకు చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ పి.కింగ్, ప్రిన్సి పాళ్లు ప్రొఫెసర్ జి.శశిభూషణరావు, ఎ.నరసింహారావు, జి.గిరిజా శంకర్, ఎంవీఆర్ రాజు, కె.సీతామాణిక్యం, ఆర్.పద్మశ్రీ, డి.నాగరాజుకుమారి పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ, తదితరులు

గానప్రియకు ఎమ్మెల్యే పంచకర్ల సత్కారం

పెందుర్తి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రాజ్యసభలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రసంగించిన తెలుగు అమ్మాయి గానప్రియను ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో సత్కరించారు. పెందుర్తి మండలం రాంపురానికి చెందిన గానప్రియ ఏయూలో బీటెక్ చదువుతోంది. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా దేశ వ్యాప్తంగా నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రం నుంచి ఎంపికై రాజ్యసభలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవిత గాథపై ప్రసంగించే అవకాశాన్ని దక్కించుకున్నది. ఎన్‌జీజీవోఎస్ గోల్డెన్ నంది అవార్డు గ్రహీత ఆది నారాయణను కూడా ఎమ్మెల్యే పంచకర్ల సత్కరించారు.


గానప్రియను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

ఘనంగా సత్యసాయి భజన మండలి వార్షికోత్సవం

అగనంపూడి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి భజన మండలి 19వ వార్షికోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. జననీ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు విందుల వెంకటరమణ ప్రారంభించారు. మండలి చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

జీతాల కోసం సినర్జీస్ కార్మికుల ధర్నా

కూర్మన్నపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని వీఎస్‌ఈజెడ్ దగ్గర సినర్జీస్ కార్మికులు చేస్తున్న ధర్నాకు వైసీపీ గాజువాక పరిశీలకుడు తైనాల విజయ్‌కుమార్, గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. ఏడు నెలలుగా కార్మికులకు జీతాలు చెల్లించకపోతే ఎలా జీవనం సాగించాలని ప్రశ్నించారు. బస్సు సౌకర్యాన్ని నిలిపివేయడం, కార్మికుల నుంచి వసూలు చేసిన పీఎఫ్‌లను కట్టకుండా కాలయాపన చేయడం, మౌలిక వసతులపై శ్రద్ధ పెట్టకపోవడం, తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ 86వ వార్డు అధ్యక్షుడు చేగొండి శ్రీనివాస్ తదితరులు, సినర్జీస్ కార్మికులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న సినర్జీస్ కార్మికులు

మరోసారి మాటతప్పిన పోర్టు అధికారులు

» ప్రారంభం కాని వల్లభాయ్ పటేల్ వంతెన
» అధికారుల తీరుపై స్థానికుల నిరసన

మల్కాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్‌యార్డు సమీపంలో ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన ప్రారంభం విషయంలో పోర్టు అధికారులు మరోసారి మాట తప్పారు. నవంబరు 2న గ్యారంటీగా వంతెన ప్రారంభిస్తామంటూ ఎమ్మెల్యే గణబాబు ద్వారా పోర్టు అధికారులు చెప్పించారు. దీంతో ప్రజలందరూ సంతోషంగా ఎదురుచూశారు. కానీ వంతెన ప్రారంభించలేదు. వంతెన పనులను పోర్టు అధికారులు నత్తనడకనే కొనసాగిస్తున్నారు.తాజాగా కేంద్ర షిప్పింగ్ కార్యదర్శి నగరానికి ఎప్పుడొస్తే అప్పుడే ప్రారంభిస్తారని కొత్తపాట అందుకున్నారు. లేదా కేంద్రం సూచించిన తేదీన ప్రారంభిస్తామని చెబుతున్నారు. వంతెన ముందు భాగంలో ఆదివారం నుంచి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఎప్పటికి పూర్తవుతుందో తెలియదు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వంతెనను తొందరగా ప్రారంభించాలని పారిశ్రామిక ప్రాంత వాసులు ముక్తకంఠంతో కోరుతున్నారు.


ప్రారంభోత్సవానికి సిద్ధమైన వల్లభాయ్ పటేల్ వంతెన

సౌత్‌లో రూ.5,634 కోట్ల రుణాలు

ఏపీ రాజధానిపై స్పష్టతతో పెరగనున్న వ్యాపారం

ఎల్ఐసీ హౌసింగ్ ఎండీ, సీఈఓ త్రిభువన్ అధికారి

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లోని తొలి ఆరు నెలల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో కూడిన దక్షిణ రీజియన్‌లో రూ.5,634 కోట్ల హౌసింగ్ రుణాలు ఇచ్చినట్టు ఎల్ఐసీ హౌసింగ్ ఎండీ, సీఈఓ త్రిభువన్ అధికారి తెలిపారు. రీజనల్ సమావేశానికి విశాఖపట్నం వచ్చిన ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. సంస్థ దేశ వ్యాప్తంగా ఇచ్చే రుణాల్లో దక్షిణ రీజియన్ వాటా 25 శాతంగా ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సరం (2024-25) ఈ రీజియన్‌లో రూ.13,050 కోట్ల రుణాలు పంపిణీ చేశామన్నారు. ఈ ఏడాది రూ.15 వేల కోట్లు ఇచ్చే అవకాశం ఉందన్నారు. ఏపీలో గత ప్రభుత్వం రాష్ట్ర రాజధాని విషయంలో పెట్టుబడిదారులను డైలమాలో పెట్టిందని, ఇప్పుడు ప్రభుత్వం మారిన తరువాత స్పష్టత వచ్చినందున గృహ నిర్మాణం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. సంస్థకు రుణగ్రహీతల నుంచి రూ.63 వేల కోట్లు రావలసి ఉందన్నారు. సంస్థకు దేశవ్యాప్తంగా 303 మార్కెటింగ్ ఆఫీసులు ఉండగా, ఏపీలో మూడు క్లస్టర్లు, 20 ఏరియా కార్యాలయాలతో పటిష్టమైన నెట్‌వర్క్‌తో పనిచేస్తున్నామన్నారు.


త్రిభువన్ అధికారి

ఘనంగా లక్ష గాజుల గౌరీ నోము

పెందుర్తి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా విశాఖ రూరల్ జిల్లా మాజీ వైసీపీ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు పెందుర్తిలో లక్ష గాజుల గౌరీ నోము నిర్వహించారు. శరగడం ఇంటి వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై గౌరీదేవి విగ్రహాన్ని లక్ష గాజులతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పూజలో పాల్గొన్నారు. అనంతరం మహిళలకు గాజులను అందజేశారు.


లక్ష గాజుల గౌరీ నోములో శరగడం దంపతులు

కొక్కిరాపల్లి వద్ద ఘోర ప్రమాదం

» ఆగి ఉన్న ఆటోను ఢీకొన్న టాటా మ్యాజిక్
» ఇద్దరి మృతి, ఎనిమిది మందికి తీవ్ర గాయాలు
» సహాయక చర్యల్లో పాల్గొన్న హోం మంత్రి అనిత


కొక్కిరాపల్లి వద్ద జరిగిన ప్రమాద దృశ్యం

ఎలమంచిలి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కిరాపల్లి వద్ద జాతీయ రహదారిపై సోమవారం ఆగి ఉన్న ఆటోను టాటా మ్యాజిక్ ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందారు. ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. గాజువాక శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన బండి సాలేమ్ రాజు ఏడుగు రితో కలిసి టాటా మ్యాజిక్ వాహనంలో కాకినాడ జిల్లా పిఠాపురం బయలుదే రారు. ఉదయం 10.20 గంటలకు కొక్కి రాపల్లి ప్రేమసమాజం వద్దకు వచ్చేస రికి ముందు వెళుతున్న లారీని ఎడమ వైపు నుంచి ఓవర్‌టేక్ చేసే క్రమంలో డ్రైవర్ కె.నానిబాబు ఆగి వున్న ఆటోను ఢీకొన్నాడు. సీఐ ధనుంజయరావు, ఎస్ఐ ఉపేంద్ర చేరుకుని, వాహనాల్లో ఇరుక్కుపోయిన వారికి బయటకు తీశారు. ఆటోలో ప్రయాణిస్తున్న కశింకోట మండలం తీడ గ్రామానికి చెందిన ఆరుగురు, టాటా మ్యాజిక్‌లోని బండి జాస్మిన్, బండి కరుణ, బండి ఆనంద విజయ, బండి అబ్బాయిలకు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ కె.నానిబాబు, బండి నరసింగరావు అలియాస్ సాలేమ్‌రాజు, నడిగట్ల విజయ, ఎస్.రాజ్‌కుమార్ స్వల్పంగా గాయపడ్డారు. అదే సమయంలో హోం మంత్రి వంగలపూడి అనిత నక్కపల్లి వెళుతూ కాన్వాయ్‌ను ఆపించి, క్షతగాత్రులను ఆస్పత్రుల కు తరలించేలా చర్యలు చేపట్టారు. అనకాపల్లి పంపిన క్షతగాత్రుల్లో గొంది పెంటయ్య (56), బాదంపూడి లక్ష్మి(65) చికిత్స పొందుతూ మృతిచెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు.

స్టీల్‌సిటీ డిపోను కొనసాగించాలి

ద్వారకాబస్‌స్టేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల అవసరాల దృష్ట్యా ఆర్టీసీ స్టీల్‌సిటీ డిపోను యధాతథంగా కొనసాగించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్‌ఎంయూఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను కోరారు. ఈ మేరకు నగరానికి వచ్చిన మంత్రికి సోమవారం వినతిపత్రం అందజేశారు. 1990లో డిపోను ఆర్టీసీ యాజమాన్యం ఏర్పాటు చేసిందని, అప్పట్లో రూ.1.5 కోట్లతో పరిపాలనా భవనం, గ్యారేజీ, బస్‌కాంప్లెక్సు నిర్మించారన్నారు. లీజు ఒప్పందం ముగియడంతో ఆస్థలాన్ని ఖాళీ చేయాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం నోటీసులు ఇచ్చింద ని, గడువు పొడిగించాలంటే రూ.138 కోట్లు చెల్లించాలని పేర్కొందని వివరించారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని గతంలోని ఒప్పందం మేరకే డిపోను కొనసాగించేలా సహకరించాలని కోరారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజులకు వినతిపత్రం ప్రతులను అందజేశారు. పిళ్లా శంకరరావు, సాయిరాం, నాయకులు పాల్గొన్నారు.


కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాసరావు

ప్రజా ఉద్యమంగా కోటి సంతకాల సేకరణ: మళ్ల

మల్కాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజాఉద్యమమంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం కొనసాగుతోందని పశ్చిమ నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక గుడివాడ అప్పన్న కాలనీలో సోమవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మళ్ల మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వైసీపీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు.

10 నుంచి అఖిల భారత పోస్టల్ టేబుల్ టెన్నిస్

ఎంవీపీ కాలనీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల పదో తేదీ నుంచి 14 వరకూ 40వ అఖిల భారత పోస్టల్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ విశాఖలో నిర్వహించనున్నట్టు విశాఖ ప్రాంతీయ పోస్ట్‌మాస్టర్ జనరల్ వీఎస్ జయశంకర్ తెలిపారు. ఎంవీపీ కాలనీలోని తపాలా శాఖ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎంవీపీ కాలనీలోని ఎస్ 3 స్పోర్ట్స్ ఎరీనాలో పోటీలు నిర్వహిస్తామన్నారు. అనంతరం టోర్నమెంట్ లోగో, టీజర్‌ను ఆవిష్కరించారు. దేశంలోని తపాలా శాఖ 14 సర్కిళ్ల నుంచి 121 మంది క్రీడాకారులు పాల్గొంటారని, మెన్స్ సింగిల్స్, డబుల్స్, విమెన్స్ సిగిల్స్, డబుల్స్ పోటీలు జరుగుతాయన్నారు. డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఎన్‌వీఎస్ఎన్‌రాజు, డిప్యూటీ సూపరింటెండెంట్ కోమల్‌కుమార్, రీజనల్ ఆఫీసు అసిస్టెంట్ డైరెక్టర్ కేవీడీ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నాగబంధం విగ్రహ ప్రతిష్ఠ

అగనంపూడి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస సీతారామాలయం ప్రాంగణంలో ఉన్న రావి చెట్టు వద్ద నాగబంధం విగ్రహ ప్రతిష్ఠను సోమవారం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు హాజరయ్యే మైనారిటీ యువతకు ఉచిత శిక్షణ

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సీఈడీఎం) సంస్థ విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మైనారిటీ యువతకు పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనుంది. ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీ మతాల యువతకు ఎస్ఐ, కానిస్టేబుల్స్, టెట్, డీఎస్సీలో శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు 0891-2502271 నంబరులో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

అర్జీదారులతో అధికారులు నేరుగా మాట్లాడాలి

» కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

» పీజీఆర్ఎస్‌కు 413 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అధికారులు

మహారాణిపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడంలో భాగంగా అర్జీదారులతో నేరుగా జిల్లా అధికారులే మాట్లాడాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. ఈ విషయంలో దిగువస్థాయి సిబ్బంది ప్రమేయం ఉండకూడదని హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌తో సహా జిల్లా అధికారులు మొత్తం 413 వినతులను స్వీకరించారు. జీవీఎంసీకి 148, పోలీసు విభాగానికి 126, మిగిలి 32 శాఖలకు 107 వినతులు అందాయని తెలిపారు. అనంతరం ప్రజా స్పందన, తదితర నివేదికలను పరిశీలించారు. వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించి మార్గదర్శకాలు జారీ చేశారు. ఫిర్యాదుదారులతో జిల్లా అధికారులు తప్పనిసరిగా మాట్లాడాలని, కింద సిబ్బందితో తూతూమంత్రంగా ఫోన్‌కాల్ చేసి సరిపెడితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ ఆందోళన

ఆనందపురం మండలం తర్లువాడలో గూగు ల్ డేటా సెంటర్‌కు భూముల కేటాయింపు, అదానీ అంబుజా సిమెంట్ గ్రేడింగ్ ఫ్యాక్టరీ ప్రతిపాదనలపై సీపీఐ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు పార్టీ ప్రతినిధి బృందం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించింది. గత ప్రభుత్వం 2019 లో అదానీ డేటా సెంటర్‌కు కాపులుప్పాడ వద్ద 400 ఎకరాలు కేటాయించగా, ఇప్పటికీ ఖాళీగా ఉందని, దానినే గూగుల్ డేటా సెంటర్‌కు కేటాయించాలన్నారు. అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

జీవీఎంసీకి 137 ఫిర్యాదులు

జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు 137 ఫిర్యాదులు అందాయి. మేయర్ పీలా శ్రీనివాసరావు, అదనపు కమిషనర్ ఎస్ఎస్‌వర్మ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు

తడిసిన రేషన్ బియ్యం



డీలర్లకు చేరిన తడిసిన బియ్యం

గాజువాక/మహారాణిపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రేషన్ డిపోల ద్వారా నవంబరు నెలకు సంబంధించి పంపిణీ చేస్తున్న బియ్యం తడిచినట్టుగా కార్డుదారులు చెబుతున్నారు. అక్కడక్కడా పంచదార కూడా అలాగే ఉందం టున్నారు. గాజువాక, వన్‌టౌన్, కంచరపాలెం, పెందుర్తి, మధురవాడ, తదితర ప్రాంతాల్లోని డిపోలకు నవంబరు నెలకు సంబంధించి గత నెల చివరివారంలో పౌర సరఫరాల సంస్థ గోదాముల నుంచి బియ్యం, పంచదార సరఫరా చేశారు. గోదాములో ఉన్న సిబ్బంది ఆయా డిపోలకు సంబంధించి ఇండెంట్ మేరకు వాహనాల్లో సరుకు లోడు చేస్తారు. తుఫాన్ నేపథ్యంలో గత నెల 29వ నుంచే డిపోల ద్వారా కార్డుదారులకు సరుకులు పంపిణీ ప్రారంభించారు. అయితే కొన్నిచోట్ల బియ్యం, పంచదార తడిసి ఉండడంతో తీసుకునేందుకు కార్డుదారులు విముఖత చూపుతున్నారు. దీంతో డీలర్లు నచ్చజెప్పి కట్టబెడుతున్నారు.

ఎండీఎం కోఆర్డినేటర్‌గా మురళీమోహనరావు

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నభోజన పథకం అమలు పర్యవేక్షణ కోఆర్డినేటరుగా విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహనరావు, మరుగుదొడ్ల నిర్వహణ కోఆర్డినేటరుగా విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కేవీ సుబ్బారావులు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

జీవీఎంసీలో 9 మందికి పదోన్నతి

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలో తొమ్మిది మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి లభించింది. వారికి మేయర్ పీలా శ్రీనివాసరావు సోమవారం ఉత్తర్వులను అందజేశారు. పదోన్నతి పొందినవారిలో వి.వీరబాబు, ఎ.రామునాయుడు, జి.శేఖర్, ఎన్.శ్రీను, యు.లలితాంబిక, ఏబీకతరిన్, రాజేంద్రప్రసాద్, ఎన్.నవితేజ్, వి.రమేష్‌కుమార్ ఉన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రమణమూర్తి, ఏఓ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు హోమ్‌స్టేపై అవగాహన సదస్సు

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సొంత ఇల్లుండి, అందులో కొంత భాగం పర్యాటకులకు అద్దెకు ఇవ్వాలని భావించే వారి కోసం మంగళవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని జిల్లా పర్యాటక శాఖాధికారి తెలిపారు. 'హోమ్ స్టే, బెడ్ అండ్ బ్రేక్ ఫాస్ట్' ప్రభుత్వ విధానాలపై సిరిపురం జంక్షన్‌లోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఉదయం 10 గంటలకుసదస్సు ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వార వివరాలకు 0891-2754716 నంబరులో సంప్రదించాలని సూచించారు.

కార్తీకం పర్యాటక ప్యాకేజీలు

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం, పిక్నిక్‌ల సీజన్ కావడంతో ప్రత్యేక టూర్ ప్యాకేజీలు రూపొందించామని పర్యాటక శాఖ డివిజనల్ మేనేజర్ జగదీశ్ తెలిపారు. పంచారామాలకు రెండు రోజుల ప్యాకేజీ, అమరావతి, భీమవరం, ద్రాక్షారామం, సామర్లకోట ఆలయాలకు తీసుకెళతారు. రాత్రి 7.30 గంటలకు విశాఖలో బయల్దేరి రెండో రోజు రాత్రి 8.30 గంటలకు తిరిగి తీసుకువస్తారు.

● విశాఖపట్నం నుంచి వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయానికి, తిరుగు ప్రయాణంలో అన్నవరం సత్యనారాయణ స్వామి దర్శనానికి ప్రతిరోజు ఉదయం 5 గంటలకు బయల్దేరి రాత్రి 9 గంటలకు వస్తారు.

సిటీ టూర్

విశాఖపట్నం వచ్చే పర్యాటకుల కోసం సిటీ అప్పుఘర్ వద్దనున్న హరిత హోటల్ నుంచి ఉదయం 9 గంటలకు బయల్దేరి సాయంత్రం 5.30 గంటలకు తీసుకువస్తారు. సింహాచలం, తొట్లకొండ, రుషికొండ, కైలాసగిరి, విశాఖ, సబ్‌మెరైన్, టీయూ-142 మ్యూజియంలు, రుషికొండ వెంకన్న ఆలయం ఉంటాయి. పెద్దలకు రూ.880, పిల్లలకు రూ.700 టికెట్.

అరకు రైలు కమ్ రోడ్ ప్యాకేజీ

విశాఖ నుంచి అరకు రైలులో తీసుకెళతారు. పద్మాపురం గార్డెన్, గిరిజన మ్యూజియం, అనంతగిరి కాఫీ ప్లాంటేషన్, గాలికొండ వ్యూ పాయింట్, బొర్రా గుహలు, జంగిల్ బెల్స్ త్రైడా చూపిస్తారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం, సాయంత్రం టీ, స్నాక్స్ ఇస్తారు. పెద్దలకు రూ.1,710, పిల్లలకు రూ.1,370 టికెట్.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

గాజువాక, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలో దొంగతనాలకు పాల్పడిన నిందితుడిని గాజువాక పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. గాజువాక కైలాశ్‌నగర్‌కు చెందిన రాంబుద్ధి వేణు కుటుంబం గత నెల 24న ఒడిశా వెళ్లారు. ఇంటి తాళం విరగొట్టి ఉందని 26న పక్కింటి వారు సమాచారం ఇవ్వడంతో వచ్చి చూడగా, బీరువాలో వస్తువులు కనిపించలేదు. సీఐ కె.శ్రీనివాసరావు, ఎస్ఐ ఎ.రుక్మాంగధరావు దర్యాప్తు చేపట్టి పెదగంట్యాడకి చెందిన దుంప గణేష్ అలియాస్ బొండాలోడును నిందితుడిగా గుర్తించి వెండి కుందులు, వెండి గిన్నె, రెండు ఐరన్ రాడ్లు స్వాధీనం చేసుకున్నారు. అతడిపై 18 కేసులు ఉన్నాయని తెలిపారు.

14 కిలోల గంజాయి పట్టివేత

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీ చేస్తుండగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఇద్దరి వద్ద పది, ఒడిశాకు చెందిన ఇద్దరి వద్ద నాలుగు కిలోల గంజాయి పట్టుబడింది. వారిపై కేసులు నమోదు చేసి రైల్వే పోలీసులు కోర్టులో హాజరుపరిచారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★


కథే ఈ సినిమాకు హీరో



దేవన్


దేవన్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఉపశీర్షిక. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్. జ్యోత్స్న జి నిర్మిస్తున్నారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దేవన్ మీడియాతో ముచ్చటించారు. 'ఇదో సూపర్ నేచురల్ లవ్‌స్టోరీ. కొత్తదనంతో నిండిన ఈ కథను నిర్మాతలకు వినిపించగానే ఓకే చేశారు. కృష్ణుడు ఒక ప్రేమ కథలో తన లీలలు ఎలా చూపిస్తారనేది ఆసక్తికరంగా చూపిస్తున్నాం. మనుషులు ఎలాగూ గడిచిపోయిన కాలాన్ని తిరిగి తీసుకురాలేరు. దైవత్వంతో ఆ కాలాన్ని తిరిగి తీసుకురావడమే చిత్ర కథాంశం. కృష్ణతత్వాన్ని అందరికీ మరింత బాగా అర్థమయ్యేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి. కథే ఈ సినిమాకు హీరో. ప్రేమలోని గొప్పదనాన్ని అందంగా ఆవిష్కరిస్తుందీ చిత్రం. భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. చిత్రం అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

నటుడిగా యాభై ఏళ్లు.. 22న భారీ వేడుక!




విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు నటుడిగా పరిచయమై ఈ ఏడాదికి యాభై ఏళ్లు. ఆయన హీరోగా నటించిన తొలి చిత్రం 'స్వర్గం నరకం' 1975 నవంబరు 22న విడుదల అయింది. ఈ అసాధారణ ప్రయాణాన్ని గౌరవించుకునే క్రమంలో ఈ నెల 22న 'ఎంబీ 50.. ఏ పెర్ల్ నైట్ ట్రిబ్యూట్' అనే పేరుతో ఓ భారీ వేడుకను మంచు విష్ణు నిర్వహించనున్నారు. 'దిగ్గజ నటుడిని, భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకొనేలా ఈ ఈవెంట్ ఉంటుందని మంచు విష్ణు చెప్పారు. ఎలాంటి సినిమా నేపథ్యం లేకపోయినా ఒంటరిగా సినీ ప్రయాణం మొదలు పెట్టి, తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని విలక్షణ నటుడిగా ఎదిగిన మోహన్‌బాబు ఎదిగిన జర్నీ గురించి అందరికీ మరోసారి వివరించి చెప్పనున్నారు. ఈ వేడుక పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని మంచు విష్ణు చెప్పారు.

ఉత్తమ నటుడిగా మమ్ముట్టి రికార్డ్!



సోమవారం ప్రకటించిన కేరళ ఫిల్మ్ అవార్డ్స్‌లో మలయాళ చిత్రరంగ సూపర్‌స్టార్ మమ్ముట్టి ఏడోసారి ఉత్తమ నటుడిగా ఎన్నికై అరుదైన రికార్డ్ నెలకొల్పారు. నటుడు ప్రకాశ్‌రాజ్ అధ్యక్షతన ఏర్పాటైన ఏడుగురు సభ్యులున్న జ్యూరీ కమిటీ అవార్డులను ఎంపిక చేసింది. త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేరళ మంత్రి షాజీ చెరియన్ అవార్డుల వివరాలు వెల్లడించారు. 'భ్రమయుగం' చిత్రంలో నటించిన మమ్ముట్టి ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'మంజుమ్మల్ బాయిస్' ఎన్నికైంది. ఉత్తమ దర్శకుడు అవార్డ్ సహా మొత్తం ఎనిమిది అవార్డులతో ఈ సినిమా సత్తా చాటింది. ఉత్తమ నటుడిగా తను మరోసారి ఎన్నిక కావడంపై మమ్ముట్టి వ్యాఖ్యానిస్తూ 'ఇదో ప్రయాణం.. రకరకాల వ్యక్తులతో కలిసి చేసే సుదీర్ఘ ప్రయాణం. ఇక్కడ పోటీ అనే పదానికి తావు లేదు' అని అన్నారు.

రాకెట్‌కు బాహుబలి పేరు - రాజమౌళి హర్షం



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఇటీవలె ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ రాకెట్‌కు దాని బరువు, సామర్థ్యానికి తగ్గట్టుగా 'బాహుబలి' అనే పేరు పెట్టడంపై దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'దేశానికి గర్వకారణమైన క్షణం ఇది. మా సినిమా టైటిల్‌తో ఉన్న రాకెట్ ఇంత గొప్ప విజయాన్ని సాధించడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది' అని ఇస్రో శాస్త్రవేత్తలను రాజమౌళి అభినందించారు.

సినిమా టిక్కెట్‌ల వివాదంపై సుప్రీం స్టే

మల్టిప్లెక్స్‌లలోని సినిమా టిక్కెట్‌లకు ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఏకరూప టిక్కెట్ విధానాన్ని (రూ.200 + జీఎస్టీ) ప్రశ్నిస్తూ హోంబలె ఫిల్మ్, మల్టిప్లెక్స్‌ల సంఘం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు సింగిల్ జడ్జి మధ్యంతర స్టే ఇచ్చారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. సెప్టెంబరు 30న 'ఆడిట్ చేసే విధంగా రికార్డులను నిర్వహించాలి' అని ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం టిక్కెట్ ధరలపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. మల్టిప్లెక్స్‌లలో వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నారని, ఇప్పటికే థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోందనీ, మరింత సహేతుకంగా ధరలను నిర్ణయించాలని, లేకపోతే హాళ్లు ఖాళీగా మారిపోతాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. *బెంగళూరు (ఆంధ్రజ్యోతి)*

మన జీవితాలకు వర్తించేలా ఉంటుంది



దీక్షిత్ శెట్టి

'దసరా', 'దియా' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్ శెట్టి నటించిన తాజా చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించారు. గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్లపై ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ నెల 7న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు దీక్షిత్ శెట్టి. 'దసరా' సినిమాలో నేను పోషించిన పాత్ర నచ్చి, 'ది గర్ల్ ఫ్రెండ్'లో నటిస్తారా అని దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అడిగారు. ఆయన చెప్పిన స్క్రిప్ట్ నచ్చి వెంటనే అంగీకరించాను. ఇందులో నా పాత్ర పేరు విక్రమ్. నా పాత్ర తీరుతెన్నులు ఎలా ఉంటాయి అనేది చాలా క్లియర్‌గా వివరించేవారు రాహుల్. నా పాత్రకు కొన్ని నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. ఇప్పటిదాకా మనం చూసిన ప్రేమకథలన్నీ ఒక తరహాలోనే సాగుతుంటాయి. ప్రేమకథని మరో కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. మనందరి జీవితాలకు వర్తించేలా సినిమా ఉంటుంది' అని తెలిపారు.

PARAS